PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 210 | విజయవాడ, సోమవారం 3 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 7.00

Vol No | Vijayawada, Monday 3 March 2025 | Rs

హిందీని బలవంతంగా రుద్దుతారా?

- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు
- కేంద్ర, రాష్ట్రాల మధ్య రగులుతున్న వివాదం

7



టీమిండియా హ్యాట్రిక్

8



సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

స్థానిక సమస్యలపై 8 నుండి

ప్రజాచైతన్య యాత్రలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- 22 నుండి మహాజర్లు, ధర్నాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 8వ తేదీ నుండి 17వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కుల కోసం ఈ యాత్రలు గళం విప్పుతాయని తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, కె.ప్రభాకరరెడ్డితో కలిసి శ్రీనివాసరావు మాట్లాడారు. రెండురోజులపాటు విజయవాడలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. మార్చి 8 నుండి 17వ తేదీ వరకూ యాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 22వ తేదీ నుండి 28వ తేదీ వరకూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద మహాజర్లు సమర్పిస్తామని, ధర్నాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే ఏప్రిల్, మే నెలల్లో పోరాట రూపకల్పన చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల అధ్యయనం కోసం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకత్వాలు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తాయని తెలిపారు. పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేస్తారని, మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సూపర్ 6 వాగ్దానాల్లో ముఖ్యమైన ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించాలని, ఉగాది నాటికి యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1,500 అమలును ప్రకటించాలని కోరుతూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కొత్త ప్రభుత్వంలో అయినా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని, బడ్జెట్లో రాయితీలు ఏమైనా ఇస్తారేమోనని తొమ్మిది నెలలపాటు ప్రజలు ఎదురు చూశారని వారి ఆశలు అడియాశలయ్యాయని వివరించారు. పాలకులు చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలకు నిధులు తగ్గింపు ద్వారా వాటిని కుదించే ప్రయత్నం చేశారని విమర్శించారు. పి4 పేరుతో 20 శాతం మంది లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకహోదా తీసుకొస్తే పెట్టుబడిదారులు పరిగెత్తుకుంటూ వచ్చేవారని, పదిసార్లు కేంద్రం చుట్టూ తిరిగిన చంద్రబాబునాయుడు ఒక్కసారి కూడా హోదా ప్రస్తావన చేయలేదని మిగతా 2లో

అయోమయంలో

మిర్చి రైతు

మార్కెట్ ఇంటర్‌వెన్షన్‌పై విడుదల కాని ఉత్తర్వులు

ఆచరణలోకి రాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలు



గుంటూరు యార్డులో మిర్చి బస్తాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లాప్రతినిధి

మిర్చికి ఐదేళ్లుగా ఉన్న ఆశాజనకమైన ధరలు ప్రస్తుతం సగానికిపైగా పడిపోయిన నేపథ్యంలో మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ప్యాకేజీ రైతులకు ఎంతవరకు మేలు చేస్తుందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. క్వింటాల్ మిర్చి ధర రూ.11,781 కంటే తగ్గితే సాయం చేస్తామని ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. గత నెల రోజుల్లో రాష్ట్రంలో మిర్చి క్వింటాల్‌కు కనిష్టంగా రూ.9 వేలు, గరిష్టంగా రూ.13,500 లభిస్తోంది. గత వారం రోజుల్లో క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు ధర పెరిగిందని అధికారులు తెలిపారు.

రూ.11,781 కంటే ధర తగ్గితే సంబంధిత వ్యత్యాసం సొమ్ము ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం వల్ల తమకు పెద్దగా ప్రయోజనం ఉండబోదని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అదనంగా ధరలు వచ్చే అవకాశం ఉందని అధికార యంత్రాంగం భావిస్తోంది. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ద్వారా రైతులకు సాయంపై ఇంతవరకు ఉత్తర్వులు రాలేదు. ధరలు కొద్దిగా పెరిగే వరకు వేచి చూసే ధోరణి అవలంబించాలని మార్కెటింగ్ శాఖకు మౌఖిక ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. ఇందువల్లే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్లో ధరల స్థిరీకరణ నిధి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారని చెప్తున్నారు. అన్ని పంటలకు కలిపి ఇంత తక్కువ మొత్తం కేటాయిస్తే మిర్చి రైతుకు ఎంత కేటాయిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. గతేడాది డిసెంబరు నుంచి ఫిబ్రవరి 28 వరకు జరిగిన క్రయవిక్రయాల వివరాలు మాత్రమే ప్రభుత్వం కోరిందని మిర్చి యార్డు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 2024-25 వ్యవసాయ సీజన్‌లో 4,18,665 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఇందుకు సంబంధించి 2,17,490 మంది రైతులు, కౌలు రైతులు ఇ-క్రాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎకరాకు సగటు దిగుబడి 20 క్వింటాళ్ల వరకు వస్తుందని అధికారుల అంచనా. 2017లో ఎకరాకు రూ.1,500 మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం ద్వారా ప్రభుత్వం సాయం అందించింది. అయితే, ప్రస్తుతం పెరిగిన పెట్టుబడి వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని ప్రస్తుతం ధరలు తగ్గినందున క్వింటాలుకు కనీసం రూ.3 వేలు ఇస్తే కొంతవరకు కోలుకునే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఈ లెక్కన మొత్తం దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున ఒక్కో రైతుకు రూ.60 వేలు సాయం అందిస్తే కొంత ప్రయోజనం ఉంటుంది. ఈ ప్రాతిపదికన 4,18,665 ఎకరాలకు రూ.2,512 కోట్లవుతుంది. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తే రైతులకు మేలు జరుగుతుంది. కానీ, ప్రభుత్వం ప్రతిపాదించిన ధర రూ.11,781 కంటే తక్కువ వస్తే తాము ఈ ధరకు రైతుల నుంచి 25 శాతం దిగుబడులు కొంటామని ప్రభుత్వం చెప్పడం వల్ల తమకు ఒనగూరే ప్రయోజనం చాలా తక్కువని రైతులు చెబుతున్నారు. 20 క్వింటాళ్ల దిగుబడిలో క్వింటాలుకు రూ.10 వేలు వస్తే మిగతా రూ.1,781 చొప్పున 25 శాతం దిగుబడికి అంటే ఐదు క్వింటాళ్లకు తమకు దక్కేది కేవలం రూ.8,905 మాత్రమేనని రైతులు అంచనా వేస్తున్నారు.

ధాన్యం దళారుల పాలు

- ఒక్క గింజా కొనని ప్రభుత్వం
- తక్కువ ధరకు తెగనమ్ముకుంటున్న రైతులు

3

జీడి మామిడికి మద్దతు ధర ప్రకటించాలి

- రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- 17న ఐటిడిఎ, కలెక్టరేట్ల వద్ద ధర్నాకు పిలుపు

3

'క్లస్టర్'తో రెవెన్యూ సేవలు ఆలస్యం!

- విస్తీర్ణాన్ని బట్టి హేతుబద్ధీకరణ చేయాలంటున్న విఆర్‌ఓలు
- మున్సిపల్ శాఖలో సీనియారిటీ జాబితాలపై కసరత్తు

2



7న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 7వ తేదీన జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలోని మొదటి భవనంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం జరగనుంది. మంత్రివర్గ సమావేశంలో పొందుపరచాల్సిన అంశాలను ఈ నెల 5వ తేది సాయంత్రం 4 గంటలలోపు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ ముఖ్యకార్యదర్శులు/ కార్యదర్శులకు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

- తొలుత ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం
- పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఆలస్యం

ప్రజాశక్తి- యంత్రాంగం

శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. రాష్ట్రంలోని మూడు శాసనమండలి స్థానాలకు గత 27న ఎన్నికలు జరిగాయి. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో 69.57 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లు 3,47,116 మంది ఉండగా, 2,41,502 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో 69.50 పోలింగ్ నమోదైంది. మొత్తం 3,14,984 మంది ఓటర్లకుగానూ 2,18,902 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.40 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 22,493 మంది ఓటర్లకుగానూ 20,783 మంది ఓటు వేశారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ ఓట్ల లెక్కింపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కానుంది. తొలుత ఒక్కో అభ్యర్థికి లభించిన మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. 50 శాతం ప్లస్ 1 ఓట్లు వచ్చిన వారిని విజేతగా ప్రకటిస్తారు. అలా జరగకపోతే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. తదుపరి ఎలిమినేషన్ రౌండ్ ఆరంభమవుతుంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తొలుత వెలువడనున్నాయి. పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓట్లు ఎక్కువగా ఉన్నందున ఫలితాలు అలస్యం అయ్యే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పది మంది బరిలో ఉన్నా ప్రధాన పోటీ యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, బిజెపి మద్దతునిచ్చిన పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు, టిడిపి, జనసేన మద్దతు నిచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మధ్యనే ఉంది. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజరింగ్ కాలేజీలో కౌంటింగ్ జరగనుంది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 35 మంది బరిలో నిలిచారు. ప్రధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి డి.వీరరాఘవులు, టిడిపి కూటమి అభ్య,ర్థి పి.రాజశేఖరం మధ్య ఉంది. కౌంటింగ్ ఏలూరులోని సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుంది. కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 25 మంది బరిలో నిలిచారు. వారిలో ప్రధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణ రావు, టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మధ్య నెలకొంది. గుంటూరులోని ఎసి కాలేజీలో కౌంటింగ్ జరగనుంది.



సిఐడి మాజీ చీఫ్ సునీల్‌కుమార్ సస్పెన్షన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఐడి మాజీ చీఫ్ పివి సునీల్‌కుమార్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటువేసింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును గతంలో వేధించిన కేసులో సునీల్‌కుమార్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా అమెరికా, జార్జియా, స్వీడన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యుకె లాంటి దేశాలకు వెళ్లడంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. అనధికార విదేశీ ప్రయాణాలు జాతీయ భద్రతకు ముప్పు తెచ్చేవిధంగా ఉన్నాయని భావిస్తున్నట్లు పేర్కొంది. విచారణ పూర్తయ్యేంత వరకు విజయవాడ వదిలి వెళ్లవద్దని సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అఖిల భారత సర్వీసు నిబంధనలు ఉల్లంఘనతోపాటు క్రమశిక్షణ ఉల్లంఘించారనే ఆరోపణలపై ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

దేశం ఎటుపోతోంది!

- కేంద్ర మంత్రి కుమార్తెనూ వదలని వేధింపులు
- మహారాష్ట్రలో రెచ్చిపోయిన దుండగులు

ముంబయి : దేశంలో మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండాపోతోంది. కార్పొరేట్, మనువాద జాఢ్యంతో జోగుతున్న డబుల్ ఇంజిన్ సర్కార్ ఆడబిడ్డల భద్రతను గాలికొదిలేసింది. ఏకంగా కేంద్ర మంత్రి బిడ్డనే వేధింపులకు గురి చేసి..ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన ఘటన మహారాష్ట్రలో వెలుగుచూసింది. మహారాష్ట్రలో జల్గావ్ జిల్లాలోని కోతాలి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన సంత్ ముక్తాయ్ యాత్రలో ఈ ఘటన జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే కుమార్తె తన స్నేహితులతో కలిసి పాల్గొన్నారు. అక్కడకు విచ్చేసిన యాత్రికులకు మంత్రి కుమార్తె, ఆమె స్నేహితులు ఫలహారాలు పంపిణీ చేస్తుండగా ఒక వ్యక్తి వాళ్లను వెంబడించాడు. తరువాత వీరంతా యాత్రలో వినోద కార్యక్రమాలు తిలకిస్తుండగా అదే వ్యక్తి మరికొంత మందితో కలిసి వీరిని వీడియో తీసాడు. దీంతో మంత్రి భద్రతా సిబ్బందిలో ఒకరు వీడియో తీస్తున్న మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాడు. దీంతో భద్రతా సిబ్బందిపైనా సదరు దుండగులు భౌతిక దాడి పాల్పడ్డారు. ఈ విషయంపై ఆదివారం మంత్రి రక్షా ఖడ్సే తన కుమార్తెతో కలిసి ముక్తాయ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేధింపులకు పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాలికలు, మహిళల భద్రతపై పోలీసు అధికారులను మంత్రి నిలదీశాలరు. 'భద్రత ఉన్న మంత్రి కుమార్తెకే ఇలాంటి సంఘటనలు జరగగలిగితే, రాష్ట్రంలో సాధారణ బాలికల పరిస్థితి ఏమిటి' అని ఆమె ప్రశ్నించారు.ఈ అంశంపై రక్షా ఖడ్సే మావయ్య, మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే మాట్లాడుతూ వేధింపులకు పాల్పడిన వ్యక్తులపై గతంలోనే అనేక ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. మహారాష్ట్రలో మహిళలపై నేరాల కేసులు పెరగడం ఆందోళన కలిగించే విషయమని, నేరస్థులకు ఎలాంటి భయం లేకుండా పోతోందన్నారు. 'సాధారణంగా ఇలాంటి విషయాల్లో ఫిర్యాదు చేసేందుకు ముందుకు రారు. ఎందుకంటే అమ్మాయిల పేర్లు బహిర్గతమయితే తమకు అవమానం జరిగినట్లుగా కుటుంబ సభ్యులు భావిస్తారు. కానీ నేను నా మనవరాలిని ఫిర్యాదు చేయమని, ఎవరికీ భయపడవద్దని చెప్పాను. ఇలాంటి దుండగుల ఆటకట్టించేందుకు ఫిర్యాదు చేయడం తప్ప మరో మార్గం లేదు' అని తెలిపారు.

పునరాలోచించుకోవాలని పోలీసుల సలహా !

ఈ దారుణ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లినప్పుడు రక్షా ఖడ్సే మిగతా 2లో

ఆటోను ఢీకొన్న కారు

చిన్నారి సహా నలుగురు మృతి





ప్రజాశక్తి- అనంతపురం

అనంతపురం నగర శివార్లలోని కూడేరు మండల పరిధిలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను కారు ఢీకొనడంతో ఒక చిన్నారి సహా నలుగురు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన సరస్వతి (40) గార్లదిన్నె మండలం మర్తాడులోని తన పుట్టినింటిలో వడిబియ్యం పోసుకుని ఆటోలో తన మెట్టినింటికి బయలు దేరారు. ఆమె వెంట తన ఆరు నెలల చిన్నారి విద్యశ్రీ, వారి అక్కలు నీలమ్మ (50, యోగేశ్వరి (45) మరో ఇద్దరు ఉన్నారు. వీరి ఆటోను కూడేరు మండలం స్కంద వెంచర్ వద్ద ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సరస్వతి అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద విషయం తెలిసిన సిఐ రాజు, కూడేరు పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి విద్యశ్రీ, నీలమ్మ, యోగేశ్వరి మృతి చెందారు. ఆటో డ్రైవర్ జ్ఞానేష్, మరో ఇద్దరు ఆనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారులో ముగ్గురు యువకులు, ఇద్దరు యువతులు ఉన్నారు. వీరిని పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కూడేరు పోలీసులు తెలిపారు.

చిక్కుల్లో సెబి మాజీ చీఫ్ మాధబి

- ఎఫ్ఐఆర్ నమోదుకు ప్రత్యేక కోర్టు ఆదేశం



ముంబయి: సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) మాజీ చైర్‌పర్సన్ మాధబి పురీబచ్ మరోమారు చిక్కుల్లో పడ్డారు. స్టాక్ మార్కెట్ అవకతవకలు, నియంత్రణల ఉల్లంఘనకు సంబంధించిన ఆరోపణలపై ఆమెతో సహా ఐదుగురు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అవినీతి నిరోధక బ్యూరో (ఎసిబి)ను ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు పిటిఐ వార్తా సంస్థ ఆదివారం ఒక కథనం ప్రచురించింది. 'స్టాక్ మార్కెట్ మోసం, ఉల్లంఘన విషయంలో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. న్యాయమైన, నిష్పాక్షిక దర్యాప్తు అవసరం' అని ఎసిబి ప్రత్యేక కోర్టు జడ్జి శశికాంత్ ఏక్‌నాథరావు బంగర్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ దర్యాప్తును కోర్టు పర్యవేక్షిస్తుందని, 30 రోజుల్లోగా స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. సెబీలోని జరిగిన ఆర్థిక మోసాలు, నియమాల ఉల్లంఘన, అవినీతి నేరాలపై దర్యాప్తు చేయాలని ఒక పాత్రికేయుడు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

అవసరమైతే రోబోలను దింపాలి

- టన్నెల్‌లో సహాయక చర్యల పరిశీలన అనంతరం తెలంగాణ సిఎం రేవంత్



ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో సహాయక చర్యలను పరిశీలిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్ సహాయక చర్యల్లో అవసరమైతే రోబోల సాయం తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. టన్నెల్‌లో ఎనిమిది మంది గల్లంతైన నేపథ్యంలో సహాయక చర్యలను ముఖ్యమంత్రి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు, ఏజెన్సీలతో సహాయక చర్యలపై సమీక్షించారు. అనంతరం సిఎం మీడియాతో మాట్లాడుతూ రెస్క్యూ ఆపరేషన్ మొత్తం పూర్తవడానికి మరో రెండు రోజులు సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయం చేయడం తగదని అన్నారు. సొరంగంలో గల్లంతైన కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలని తెలిపారు. తాము మనో ధైర్యం కోల్పోలేదని, మరింత పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. "2014లో తెలంగాణ ఏర్పడే నాటికి ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులు 32 కిలోమీటర్ల పూర్తయ్యాయి. కానీ, గత పదేళ్లగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బిసిని పట్టించుకోలేదు. ఈ పనులు చేస్తున్న సంస్థ విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. దీంతో గత పదేళ్లుగా టన్నెల్ పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపో యాయి. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని నిర్ణయించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రాజెక్టును పూర్తి చేయాలని.. ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభిం చాం. టన్నెల్ బోరింగ్ మిషన్‌కు కావాల్సిన విడి భాగా లను అమెరికా నుంచి తెప్పించి పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకున్నాం. అనుకోకుండా మిగతా 2లో

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయవాడ
సోమవారం 3 మార్చి 2025



రెండు రాష్ట్రాల ఉన్నత విద్యామండలి ఛైర్మన్ల భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఎపి, తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ల భేటీ ఆదివారం జరిగింది. ఎపి ఛైర్మన్ కె మధుమూర్తిని తెలంగాణ ఛైర్మన్ వి బాలకిష్టారెడ్డి మంగళగిరిలో ఎపి ఉన్నత విద్యామండలి కార్యాలయంలో కలిశారు. ఉన్నత విద్యకు సంబంధించిన కీలక అంశాలు, రెండు రాష్ట్రాల మధ్య సహకారం పెంపు, విద్యానైపుణ్యం, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధికి అవకాశాల అన్వేషణ వంటి అంశాలపై చర్చించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఆయిల్‌పామ్ సాగుకు వెనకడుగు

- లక్ష్యంలో 52 శాతానికే పరిమితం
- ధరల తిరోగమనంతో రైతుల్లో నిరాసక్తి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి
ఒకప్పుడు లాభాల పంటలు కురిపించిన ఆయిల్‌పామ్ సాగుకు తూర్పుగోదావరి జిల్లా రైతులు ఇప్పుడు వెనకడుగు వేస్తున్నారు. దేశీయ మార్కెట్లో వంట నూనెల ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం గతంలో అనుసరించిన విధానాలు, ప్రోత్సాహకాలేమి వంటి కారణాలతో కొత్తగా సాగుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లోనూ ఆయిల్‌పామ్ సాగవుతోంది. 40,826 ఎకరాల్లో సాగు విస్తరించింది. అత్యధికంగా నల్లజర్లలో 10,490 ఎకరాల్లో సాగు జరుగుతుండగా, కడియం మండలంలో అత్యల్పంగా మూడు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో కొత్తగా 7,500 ఎకరాల్లో సాగు పెంచాలనేది లక్ష్యం కాగా, 3,800 ఎకరాల్లో మాత్రమే ఇది అమలులోకి వచ్చింది. 2022 జూన్‌లో ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు గరిష్టంగా రూ.26,365 ధర పలికింది. గడిచిన పదేళ్లలో క్రమంగా ధరలు పడిపోతున్నాయి. 2022లో కొంత ఆశాజనక పరిస్థితులు ఉన్నప్పటికీ 2024 జూన్‌లో రూ.13,180కు ధర పడిపోయింది. ఫలితంగా ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు నష్టపోయామని రైతులు అప్పట్లో ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుకు కనీసం రూ.20 వేలు లభిస్తేనే సాగు చేసే పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా పంట వేయడానికి ముందుకు రావడం లేదు.

గతంలో లాభాల పంట...
జిల్లాలో పండిన ఆయిల్‌పామ్ గెలలను గానుగ ఆడించి, ముడి చమురును పెద్దాపురం, నల్లజర్లలోని యర్నగూడెంలో మిల్లులకు తరలిస్తుంటారు. ఆయా మిల్లుల్లో ప్రతి నెల సగటు ముడి చమురు నిష్పత్తి (ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో-ఒఇఆర్) ఆధారంగా అధికారులు, వ్యాపారుల కమిటీ ఆయిల్‌పామ్ గెలలకు ధర నిర్ణయిస్తుంది. 2014కు ముందు ధరలు ఆశాజనకంగా ఉండేవి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఆయా దేశాల నుంచి క్రూడ్ పామాయిల్ దిగుమతి నిలిచిపోయి దేశీయంగా వంట నూనెలను ఉత్పత్తి చేసే కంపెనీలకు ముడిసరకు కొరత ఏర్పడింది. దీంతో, రైతుల నుంచి ఆయిల్‌పామ్ గెలలను ఆయా కంపెనీలు పోటీ పడి కొనుగోలు చేశాయి. 2022 మార్చిలో టన్నుకు రూ.21,940, ఏప్రిల్‌లో రూ.22,518,



మేలో రూ.23,365, జూన్‌లో రూ.26,000 చొప్పున ధర లభించింది. 2022 అగస్టు తర్వాత కేంద్రం దిగుమతి సుంకం ఎత్తివేయడంతో గడిచిన మూడేళ్లలో పరిస్థితి పూర్తిగా తలకిందులైంది.

రైతులకు ప్రోత్సాహకం కరువు
ఆయిల్‌పామ్ సాగు చేసిన నాలుగేళ్లకు పంట దిగుబడి రావడం ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దశల వారీగా ప్రోత్సాహకం కల్పించడం పరిపాటి. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు హెక్టారుకు అంతర పంటలకు, ఎరువుల వినియోగానికి రూ.10,500 చొప్పున ప్రభుత్వ సాయం లభిస్తుంది. హెక్టారుకు 190 మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఈ మొక్కలు పంపిణీ చేసిన సంస్థలకు ప్రభుత్వమే నగదు చెల్లించాలి. అయితే, 2022-23 సంవత్సరం నుంచి జిల్లాలో రూ.3 కోట్లకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. 2022 చివరిలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్రూడ్ పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని 30 శాతం నుంచి 20 శాతానికి తగ్గించింది. తిరిగి కొన్ని నెలల వ్యవధిలోనే దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తేసింది. ఈ నేపథ్యంలో ఆయిల్ కంపెనీలు ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు ధరలను భారీగా తగ్గించాయి. ఫలితంగా సాగు గిట్టుబాటు కావడం లేదు. కొత్తగా సాగు చేయడానికి ఆసక్తి చూపడం లేదు.

ఆయిల్ పామ్ రైతుల పరిస్థితి తలకిందులు
ఆయిల్‌పామ్ సాగు ఆశాజనకంగా లేదు. ధరలలేమితో ఒడిదుడుకులు తప్పడం లేదు. ఎరువుల ధరలు పెరగడంతో గత మూడేళ్లగా సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఎకరాకు రూ.75,000 వరకూ పెట్టుబడి అవుతోంది. ఒకవైపు దిగుబడులు తగ్గడం, మరోవైపు ధరలు లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదు. కనీసం టన్నుకు రూ.20,000 చెల్లిస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది.
- పాతూరి సత్యనారాయణ, పామాయిల్ రైతు, అచ్చెన్నపాలెం, నల్లజర్ల మండలం

రైతుల ఖాతాల్లో నగదు
ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహక నగదు అందజేస్తున్నాం. జిల్లాకు రూ.2 కోట్ల నగదు ఫిబ్రవరిలో విడుదలైంది. ఈ నగదు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. గతేడాది నవంబరులో భారీ వర్షాలు, ఆయిల్‌పామ్ ధరలు లేకపోవడం వంటి కారణాల వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్త సాగు లక్ష్యం 52 శాతానికి మించలేదు. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆయిల్‌పామ్ టన్ను ధర రూ 20,200కు చేరింది. రైతులు సాగు చేసేందుకు ముందుకు రావాలి.
- బి.సుజాతకుమారి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి, తూర్పుగోదావరి జిల్లా.

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులేవీ ?

- బడ్జెట్‌పై రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ
- ముఖ్యమంత్రికి లేఖ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
రాష్ట్ర బడ్జెట్ 2025-26 నిధుల కేటాయింపులో ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం ప్రాంత అభివృద్ధి కోసం కావాల్సిన సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించబడలేదని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ పేర్కొన్నారు. ఆ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆ వివరాలను ఆదివారం వెల్లడించారు. ఎపి స్టేట్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ 2014లో సెక్షన్ 46 కింద ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. ఈ ప్రత్యేక ఆర్థిక సహాయం చేయాల్సిన బాధ్యతను శర్మ గుర్తు చేశారు. 2024 డిసెంబర్ 22న తాను రాసిన లేఖలో ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి విషయంలో పలు అంశాలను సిఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఉత్తరాంధ్రలో అతి వెనుకబడిన పలాస, ఇచ్చాపురం వంటి ప్రాంతాలకు కావల్సినది వంశధార మీద ట్రిబ్యునల్ ఆమోదించిన 'నేరేడు' ప్రాజెక్టును చేపట్టడమని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మన రాష్ట్రం తరపున సుప్రీం కోర్టులో వాదనలు ఆలస్యమై కేసు పరిష్కారం జరగడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్‌డిఎలో భాగమైన ఒడిశా ముఖ్యమంత్రికి ఆ విషయంలో విజ్ఞప్తి చేసి ఉంటే ఇప్పటికే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగి ఉండేదని తెలిపారు. ఆ విషయంలో ఆలస్యం కారణంగా ఉత్తర శ్రీకాకుళం మండలాలకు రావలసిన 23.6 టిఎంసిల సాగునీరు లభించడం లేదన్నారు. ఆ నీరు లభించి ఉంటే లక్షలాది ఎకరాల భూములలో పంటలు పండించి ఆ ప్రాంత ప్రజలు సర్వతోముఖంగా అభివృద్ధి చెందేవారన్నారు. వంశధార బహుదా నదుల అనుసంధానం ప్రాజెక్టు ఆరేళ్లుగా ప్రభుత్వం వద్ద ఉన్నా ముందుకు సాగడంలేదని తెలిపారు. ఆ నీరు లభించి ఉంటే వేలాది ఎకరాలకు సాగునీరు లభించి ఉండేదన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం రాగానే ఆ ప్రాజెక్టు చేపడతారని ఆశించిన ఆ ప్రాంత ప్రజలకు నిరాశే ఎదురైందని తెలిపారు. వెనుకబడిన ఉత్తర శ్రీకాకుళం మండలాల్లో 6,589 మైనర్ సాగునీటి ప్రాజెక్టులు, 1,800 చెరువులకు ఐదేళ్లుగా మెయింటినెన్స్ నిధుల్లేక వాటి కింద ఉన్న 2 లక్షలా 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరిగా లభించడం లేదన్నారు. ఆ విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుందా ? అని లేఖలో సిఎంను ప్రశ్నించారు. తాజా బడ్జెట్ నిధుల కేటాయింపులో పైన సూచించిన ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఉత్తరాంధ్ర ప్రజలకు, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో వెనుకబడిన ఇచ్చాపురం ప్రజలకు నిరాశ, బాధ కలిగించిందని తెలిపారు. ఇప్పటికైనా శ్రీకాకుళం, ఉత్తర ప్రాంతాలకు కావాల్సిన సాగునీటి సౌకర్యాల కోసం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న సిఐటియు కార్యకర్తలు

ప్రజా ఉద్యమంగా 'ఉక్కు' పోరాటం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు చేస్తున్న పోరాటం రానున్న కాలంలో ప్రజా ఉద్యమంగా మారనుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు భానుమూర్తి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1459వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం నాలుగేళ్ల పైచిలుకుగా సాగుతూ చారిత్రాత్మక పోరాటంగా నిలుస్తోందని తెలిపారు. కర్మాగారానికి అరకొర నిధులు విదిలించి గొప్ప సహాయం చేసినట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊదరగొడుతున్నాయన్నారు. ఆ కుయుక్తులను కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు దీటుగా ఎదుర్కొంటున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం మాత్రమే సమస్య పరిష్కారానికి మార్గమన్నారు. కార్యక్రమంలో ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, వై.రాజు, ఎం.సుబ్బారావు, టి.నూకరాజు, కళాధర్, సంజయ్, ఎర్రి బాబు, కె.నరసింగరావు పాల్గొన్నారు.

చిరుత పులి మృతి కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)
చిరుత పులి మృతి కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో యర్రగొండపాలెం అటవీ క్షేత్రాధికారి ఎస్‌వి.సుబ్బారావు విలేకర్లకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం... యర్రగొండపాలెం అటవీ రేంజ్ పరిధిలోని కొలుకుల సెక్షన్‌లోని కొలుకుల బీట్ పరిధిలోని వరదరాజులస్వామి గుడి ప్రదేశంలో గత నెల 15వ తేదీ రాత్రి అటవీ జంతువుల కోసం కొందరు ఉచ్చులు ఏర్పాటు చేశారు. ఆ ఉచ్చులో చిరుత పులి పడింది. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ ఆదేశాల


మాట్లాడుతున్న అటవీ క్షేత్రాధికారి సుబ్బారావు

మేరకు మరుసటి రోజు ఉదయం 11 గంటలకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే చిరుత పులి మృతి చెందింది. గ్రామపెద్దల సమక్షంలో పంచనామా నిర్వహించి అటవీ శాఖ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. కళేబరాన్ని అక్కడే కాల్చి వేశారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను రప్పించి సోదాలు నిర్వహించగా కొంత సమాచారం తెలిసింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిసి పుటేజ్‌ల ఆధారంగా మరికొంత సమాచారం లభ్యమైంది. అనంతరం లోతుగా దర్యాప్తు చేపట్టి పెద్ద కొలుకుల గ్రామానికి చెందిన దొంతా రామయ్య, దొంతా యల్లయ్యలను నిందితులుగా గుర్తించినట్లు ఎస్‌వి.సుబ్బారావు తెలిపారు. వారిని శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి మూడు కణితి కొమ్ములు, రెండు చుక్కల దుప్పి కొమ్ములు, ఒక కత్తి, రెండు సెల్‌ఫోన్లు, టార్చ్‌లైట్, బైకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్టు 1992, ఎపి ఫారెస్టు యాక్టు 20 ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కొలుకుల గ్రామానికి చెందిన కంచర్ల శ్రీనివాసులు, మక్కెన బాలగురవయ్య, చెన్నరాయునిపల్లికి చెందిన బురుజుల వెంకట రమణయ్య అటవీ ప్రాంతంలో ఉచ్చులు బిగిస్తూ తమ సిబ్బందిని చూసి పారిపోతుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను మార్కాపురం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

అవసరమైతే రోబోలను దింపాలి

(మొదటి పేజీ తరువాయి)
ఈ దుర్ఘటన జరిగింది' అని సిఎం వివరించారు. సిఎంతోపాటు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

టిబిఎం తొలిగిస్తేనే గల్లంతైనవారి ఆచూకీ లభ్యం
ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మందిని వెలికి తీసేందుకు మరో రెండు రోజుల సమయం పట్టనుంది. టిబిఎం సమీపంలో పది మీటర్ల లోతులో మట్టి దిబ్బల కింద మానవ ఆనవాళ్లు ఉన్నట్లు జిపిఆర్ స్కానింగ్ ద్వారా సహాయక బృందాలు శనివారం గుర్తించిన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి వరకు నలుగురిని వెలికితీస్తామని రెస్క్యూ టీమ్ అంచనా వేసినా అది సాధ్యపడలేదు. సొరంగంలో 13వ కిలోమీటరు అవతల నుంచి ఉబికి వస్తున్న నీరు, మట్టి కలిసి ఆ ప్రాంతంలో 15 అడుగుల మేట వేయడంతో సహాయక చర్యలు కష్టంగా మారాయి. టిబిఎం ఉన్న ప్రాంతంలో సొరంగం పైకప్పు స్వభావాన్ని అంచనా వేసేందుకు నిపుణులు మల్లగుల్లాలు పడుతున్నారు. సహాయక బృందాలు సొరంగంలో ప్రమాదానికి గురికాకుండా రెస్క్యూ ఆపరేషన్‌లో భాగస్వామ్యులైన 11 ఏజెన్సీల నిపుణులు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. సొరంగం పనుల కొనసాగింపు కంటే గల్లంతైన వారిని వెలికి తీయడమే ప్రథమ కర్తవ్యంగా సహాయక బృందాలు ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

'క్లస్టర్'తో రెవెన్యూ సేవలు ఆలస్యం!

- విస్తీర్ణాన్ని బట్టి హేతుబద్ధీకరణ చేయాలంటున్న విఆర్‌ఒలు
- మున్సిపల్ శాఖలో సీనియారిటీ జాబితాలపై కసరత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియ జనాభా ప్రాతిపదికన ప్రారంభమైంది. గ్రామ విస్తీర్ణాన్ని బట్టి కాకుండా జనాభా ప్రాతిపదికన ఈ ప్రక్రియ సాగుతుండటంతో విఆర్‌ఓల్లో ఆందోళన ప్రారంభమైంది. ఒక్కో సచివాలయంలో ఒక విఆర్‌ఓ విధులు నిర్వహించాల్సి ఉండగా క్లస్టర్ విధానం ద్వారా రెండు మూడు సచివాలయాలకు కలిపి విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో సచివాలయాల ద్వారా అందిస్తున్న రెవెన్యూ సేవల్లో తీవ్ర జాప్యం జరిగే అవకాశముంటుందని, జాప్యానికి కారణమంటూ విఆర్‌ఓలను ప్రజలు తప్పుపట్టే అవకాశాలుంటాయని రెవెన్యూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు సచివాలయాలకు ఒక విఆర్‌ఓ కావడంతో వేగంగా మంజూరు చేయాల్సిన ధ్రువీకరణ పత్రాలుకూడా మందకొడిగా సాగే అవకాశముంది. పనిభారం కూడా పెరిగే అవకాశముంటుందని విఆర్‌ఓలు పేర్కొంటున్నారు. గ్రామ సచివాలయాల్లో 2,899 మంది, వార్డు సచివాలయాల్లో



వార్డు రెవెన్యూ కార్యదర్శులు 1006మంది మిగులు ఉన్నట్లు ప్రభుత్వం ఇప్పటికే లెక్కలు తేల్చింది. క్లస్టర్ విధానంలో సుమారు 4వేలమంది విఆర్‌ఓలను ఎలా సర్దుబాటు చేస్తారనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో విఆర్‌ఓల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో క్యాడర్ స్ట్రెంత్ తగ్గడంతో ప్రమోషన్ల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విఆర్‌ఎల ప్రమోషన్ల ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశముందనే ఆందోళన వారిలో స్పష్టంగా కనబడుతోంది. క్లస్టర్ విధానంపై ప్రభుత్వం పునరాలోచించకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని విఆర్‌ఓల సంఘం నాయకులు అంటున్నారు.

సచివాలయ ఉద్యోగుల సీనియారిటీ జాబితా
వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా కార్యాచరణ ప్రారంభమైంది. ఉద్యోగుల సర్వీస్ మ్యాటర్, సర్వీస్ రిజిస్టర్లు, వారి సీనియారిటీ లిస్టులు తయారు చేయాలని ఆర్‌డిఎంఎ అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలుజారీ చేశారు. జిల్లా స్థాయిలో సంబంధిత కేడర్‌ల పదోన్నతుల తుది జాబితాను రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనరు అండ్ డైరెక్టర్ కార్యాలయానికి పంపాలని ప్రభుత్వం సూచించింది. రేషనలైజేషన్ ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 10కల్లా పూర్తి చేయాలని, ఉగాది నుంచి నూతన విధానం ద్వారా ఉద్యోగులు విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకునే విధంగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయశాఖను ఆదేశించింది.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

- సిఎంకు కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలని కెవిపిఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ.నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ఆదివారం సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు. స్మశానాల్లో గుంటలు తీసి పూడ్చే వృత్తి చేస్తున్న వారందరికీ గుర్తింపు కార్డులిచ్చి 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని, వయసునిండిన వారందరికీ రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. వృత్తి పరికరాలైన గడ్డపార, రెండు చెలికలు, రెండు గంపలు, గ్లౌజ్, బూట్లు, డ్రస్ ఇవ్వాలని, భయంకరమైన వ్యాధులు ప్రభలే శ్మశానంలో పనిచేసే వృత్తిదారులందరికీ ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. వృత్తిదారులందరికీ రెండెకరాల సాగు భూమి, గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లుస్థలం కేటాయించడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిఎంకు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. స్మశానాలు కబ్జాకు గురికాకుండా ఆక్రమణదారుల నుంచి కాపాడాలని, జీఓ నెంబరు 1235 ప్రకారం ప్రతి దళిత పేటకు రెండు ఎకరాలు స్మశాన స్థలం కేటాయించాలని కెవిపిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ.నల్లప్ప, అండ్ర మాల్యాద్రి కోరారు.

సంస్కరణలను స్వాగతిస్తున్నాం

- నరెడ్కో అధ్యక్షులు చక్రధర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పట్టణాభివృద్ధి, రెవెన్యూ ప్రక్రియలను సులభతరం చేయడానికి రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలను నరెడ్కో స్వాగతిస్తోందని సంస్థ అధ్యక్షులు గద్దే చక్రధర్ తెలిపారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వ్యాపార సామర్థ్యాన్ని పెంపొందించడానికి వేగవంతమైన అనుమతులు, నియంత్రణ పద్ధతులు పారదర్శకతను సాధించడానికి ఈ విధమైన మార్పులు దోహదపడతాయని తెలిపారు. రహదారి కనీస వెడల్పును 40 నుంచి 30 అడుగులకు తగ్గించడం వల్ల అనధికార లే అవుట్ల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. ప్రత్యేక పార్కింగ్‌ను అనుమతిస్తూ ఆమోదం తెలపడం వల్ల భవన నిర్మాతలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. డిసిఎంఎస్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించడం మంచి అంశమని చక్రధర్ అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో నివాస ప్రాపర్టీలు, లేఅవుట్ ప్లాట్లలో పెట్టుబడి పెట్టడానికి ప్రస్తుతం అత్యుత్తమ సమయమని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలతో రియల్ ఎస్టేట్ రంగం గణనీయమైన వృద్ధిని సాధించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ మాట్లాడుతూ... హై రైజ్ భవనాలకు అంతర్గత స్థల ప్రణాళికలకు ఎత్తు పరిమితులను తొలగించడం అత్యావశ్యకమని అన్నారు. పెద్ద రహదారులకు ఆనుకుని ఉన్న చిన్న స్థలాలకు సంబంధించి సెట్ బ్యాక్ సడలింపులను సమర్థించారు. ప్రధాన కార్యదర్శి సీతారామయ్య మాట్లాడుతూ అనుమతుల ప్రక్రియ మెరుగుదలకు విభిన్న విభాగాల సమన్వయం అవసరమన్నారు. ఫైర్, రెవెన్యూ, ఎయిర్‌పోర్ట్ విభాగాలను ఒకే విండో వ్యవస్థలో సమీకరించడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. సమావేశంలో కోశాధికారి రమేష్ బాబు, జోన్ అధ్యక్షులు సందీప్, పి.వి కృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

దేశం ఎటుపోతోంది!

(మొదటి పేజీ తరువాయి)
బృందం విస్తుపోయే ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి విషయాలను పెద్దవి చేయకూడదని, ఫిర్యాదుపై పునరాలోచించుకోవాలని పోలీసులు సలహా ఇచ్చారు. 'మేం ఫిర్యాదు చేయడం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు మమ్మల్ని రెండు గంటల పాటు కూర్చోబెట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయాలనే మా నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని పోలీసు అధికారులు కోరారు' అని ఏక్‌నాథ్ ఖడ్సే తెలిపారు.

స్థానిక సమస్యలపై 8 నుండి ప్రజాచైతన్య యాత్రలు

(మొదటి పేజీ తరువాయి)
మండిపడ్డారు. కేంద్రం నుండి రూ.20 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, వాటినీ తీసుకురావడం లేదని పేర్కొన్నారు. రెండేళ్లలో పూర్తిచేస్తామన్న వెలిగొండకు బడ్జెట్‌లో రూ.309 కోట్లు కేటాయించారని, ఇలాగైతే ఎప్పటికి పూర్తిచేస్తారని ప్రశ్నించారు. పోలవరానికి కేంద్రం రూ.12 వేల కోట్లు ఇస్తామని చెబితే రాష్ట్రబడ్జెట్లో మాత్రం రూ.6000 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఇంతకంటే అన్యాయం మరొకటి లేదన్నారు. మహిళలనూ మోసం చేశారని, ఉచిత బస్సు పథకం ప్రస్తావన లేదని, నెలకు రూ.1500 ఇస్తామని చెప్పినా నిధులు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపారని, అవసరం లేకపోయినా అదానీకి కోట్లు కట్టబెట్టేందుకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, వాటిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. సెకీ ఒప్పందాన్ని రద్దుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ధైర్యం లేకుండా పోయిందని, చిన్న దేశం శ్రీలంక అదానీతో ఒప్పందాన్ని ధైర్యంగా రద్దు చేసుకుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై విద్యుత్ భారాలు పడుతున్నాయని, అధికారంలోకి రాకముందు శ్వేతపత్రం ప్రకటించిన చంద్రబాబు ఇప్పుడు దాన్ని పక్కనబెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఈ సమయంలో వారిని ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధికి నిధులు కేటాయించాల్సిన ప్రభుత్వం రూ.300 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులకూ నిధులివ్వలేదని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు రూ.2000 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిపై దృష్టి సారించకపోవడం అన్యాయమని అన్నారు. వేదవతి, గుండ్రేగుల, ఆర్‌డిఎస్ కుడికాలువకు కనీసస్థాయి నిధులు కూడా ఇవ్వలేదని, వెలుగొండ ప్రాజెక్టుకు ఏడాదికి రెండువేల కోట్ల చొప్పున రెండేళ్లపాటు కేటాయిస్తామని చెప్పిన చంద్రబాబు రూ.309 కోట్లు కేటాయించి ప్రజలను మోసం చేశారని అన్నారు.

ప్రజా చైతన్యయాత్రల డిమాండ్లు
ప్రజా చైతన్యయాత్రలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిట్కో ఇళ్లు, నివాసముంటున్న లక్షలాది పేదలకు పట్టాలివ్వాలని, ఏజెన్సీలో పివిటిజిలకు రూ.5.లక్షలు ఇవ్వాలని కోరారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించాలని, కరువు నిధులు, మంచినీళ్ల సరఫరాకు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. భూ సమస్యలు, భూసేకరణ, సోలార్ ప్రాజెక్టులకు భూమి లీజులు వగైరా - 2013 చట్టం ప్రకారం రైతుల భూములకు రక్షణ, కూలీలకు భద్రత కల్పించాలని కోరారు. పోలవరం నిర్వాసితులు, కాలనీల సమస్యలు పరిష్కరించి కాంటూర్ లెక్కలు సవరించాలని కోరారు. అన్ని గ్రామాలకు ఒకేసారి ప్యాకేజీ ఇవ్వాలని, పాత ప్యాకేజీని తాజా పరచి పరిహారం పెంచాలని డిమాండు చేశారు. కౌలు సవరణ చట్టాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తీసుకురావాలని, అన్నదాతా సుఖీభవ అందరికీ ఇవ్వాలని, ఆప్కాస్ రద్దు ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్‌స్కేల్ ప్రకటించాలని కోరారు. మిర్చి, ధాన్యం, పత్తి, పొగాకు, శనగ తదితర పంటల గిట్టుబాటు ధరలకోసం రూ.3 వేల కోట్లు కేటాయించాలి. మార్కెట్‌లో ప్రభుత్వ సంస్థలు దిగాలని, గిరిజన ప్రాంతాల్లో జీడి, కాఫీ పంటలకు మైనర్ అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. జిఓ నెంబరు 3కోసం పోరాడతామని పేర్కొన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం నిధులు పెంచాలని, వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులకు తక్షణ ప్రాధాన్యతనివ్వాలని కోరారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం జిల్లాకు రూ.10 వేల కోట్లు ప్యాకేజీ ప్రకటించి కేంద్రం నిధులివ్వాలని డిమాండు చేశారు. సహకార చక్కెర ఫ్యాక్టరీలు, డెయిరీలను తెరిపించి ప్రభుత్వం నిర్వహించాలని, కార్మికులకు, రైతులకు బకాయిలు చెల్లించాలని, డ్వాక్రా గ్రూపులు, మైక్రో ఫైనాన్సు సమస్యలపై వడ్డీ రాయితీ చెల్లించాలని, మైక్రో ఫైనాన్స్ ఆగడాలను అడ్డుకోవాలని ఆందోళన చేపడతామని వివరించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మార్చి 14న కార్మిక సంఘాల ధర్నాలకు మద్దతు ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని కోరారు. మార్చి 12న ఉపాధి సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘాల ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. కనీస వేతనం పెంచడంతోపాటు జాబ్ కార్డులు తొలగించరాదని డిమాండు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని ప్రజాచైతన్యయాత్రలో డిమాండు చేయనున్నట్లు వివరించారు.


రావిర్యాల ఎస్‌బిఐ ఎటిఎంలో చోరీ

- రూ.30లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని రావిర్యాలలో ఎస్‌బిఐ ఎటిఎంలో సుమారు రూ.30లక్షల వరకు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదిభట్ల పిఎస్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. సిఐ రాఘవేందర్‌రెడ్డి, బ్యాంక్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రావిర్యాల ఎస్‌బిఐ ఎటిఎంలోకి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నలుగురు దుండగులు పక్కా ప్లాన్‌తో వచ్చారు. ముందుగా సీసీ కెమెరాలపై స్ప్రే కొట్టి, వైర్లు కట్ చేసి, సీసీకెమెరాల సైరాన్ మొగకుండా చేశారు. అనంతరం వారు తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను పగులగొట్టారు. ఏటీఎంలోని సుమారు రూ.30లక్షలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌బీఐ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఏటీఎంను పరిశీలించారు. బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూడు బృందాలు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి.

మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో 'శివ తేజ' ప్రతిభ

ప్రజాశక్తి - అనంతపురం



మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో అనంతపురానికి చెందిన చారుగుండ్ల శివ తేజ విజయకేతనం ఎగురవేశారు. బెంగళూరులో ఎన్‌బిఎఫ్ఎఫ్ క్లాసిక్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జరిగిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో మన రాష్ట్రం తరుపున పాల్గొన్న శివ తేజ క్లాసిక్ మెన్ ఫిజిక్ 175 సెంటి మీటర్ల విభాగంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా శివతేజ మాట్లాడుతూ.. తమ గురువు ముకేష్ గహ్లోట్ మార్గ నిర్దేశనం, తన తల్లిదండ్రుల ప్రోత్సాహం, నిరంతర కఠోర శ్రమ, అంకురిత దీక్ష, పట్టుదలే తన విజయానికి కారణమని తెలిపారు. బాడీ బిల్డింగ్‌లో తాను సాధించాల్సింది చాలా ఉందని, దాని కోసం ఎంత కష్టమైన భరించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఈ సందర్భంగా శివతేజను ఆయన తల్లిదండ్రులు మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్, టీచర్ అరుణ, వైద్యాధికారులు, సిబ్బంది అభినందించారు.

నైపుణ్యంతో కూడిన విద్య అందించాలి

- సమగ్ర శిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థుల్లో చదువుతోపాటు వృత్తి విద్య నైపుణ్యాల పట్ల ఆసక్తి కనబరిచేలా ప్రోత్సహించాలని సమగ్ర శిక్ష డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలో జరుగుతున్న వొకేషనల్ ట్రైనర్ల శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులకు 10 ట్రేడుల్లో వృత్తి విద్య కోర్సు అందిస్తున్నామని తెలిపారు. ఏ విద్యార్థినీ చదువుకు దూరం చేయకూడదని చెప్పారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న వాటిల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. వృత్తి విద్యాకోర్సు ద్వారా విద్యార్థుల డ్రాపౌట్ రేటు తగ్గించవచ్చని చెప్పారు. విదేశాల్లో ప్రాథమిక స్థాయి నుంచే వృత్తి విద్యను అందిస్తున్నారని తెలిపారు. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచన రేకెత్తించేలా, స్వశక్తిమీద జీవనాధారం పెంపొందించుకునేలా విద్యార్థులను తయారు చేయాలని చెప్పారు.

దళిత, రెడ్డి అధికారులపై సిఎం కక్షసాధింపు

- వైసిపి ఎమ్మెల్యే చంద్రశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో దళిత, రెడ్డి అధికారులపై విషం చిమ్ముతున్నారని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి విజనరీ అని చెప్పుకుంటూ విధ్వంసపు చర్యలకు దిగుతున్నారని తెలిపారు. వైసిపి పనులు చేయనంటూ ముఖ్యమంత్రి స్థాయిలో ప్రకటన చేయడం అన్యాయమని అన్నారు. లోకేష్ రాజకీయ భవిష్యత్ కోసం చంద్రబాబు తాపత్రయ పడుతున్నారని చెప్పారు. తాము తలుచుకుంటే వైసిపి నాయకులు రోడ్డుమీద తిరగలేరని హోమ్‌శాఖ మంత్రి అనిత అనడం, పచ్చబిళ్ల ఇచ్చి పనులు చేస్తామని అచ్చెన్నాయుడు చెప్పడం రాజ్యాంగ విరుద్ధ వ్యాఖ్యలని అన్నారు. దళిత, రెడ్డి కులాలకు చెందిన ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వడం లేదని, అప్రాధాన్యత పోస్టుల్లోకి పంపిస్తున్నారని తెలిపారు. 14 ఏళ్లు సిఎంగా ఉండి వెలిగొండకు సిఎం చేసింది శూన్యమని, రూ.3.20 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టి ప్రభుత్వం చేసిన కేటాయింపులపై చర్చకు సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు.

ధాన్యం దళారుల పాలు

- ఒక్క గింజా కొనని ప్రభుత్వం
- తక్కువ ధరకు తెగనమ్ముకుంటున్న రైతులు



సంగం మండలం వంగల్లులో దళారులకు అమ్ముతున్న ధాన్యం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనలకు, ఆచరణకు పొంతన లేకుండా ఉంది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు చెప్తున్నా ఇంత వరకూ ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదు. దీంతో, రైతులు దళారులకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే నెల్లూరు జిల్లాలో వరి సాగు ఆలస్యంగా చేపడతారు. జిల్లాలో సుమారు ఏడు లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు 15 లక్షల పుట్లు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ఐదు లక్షల పుట్లు కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెలాఖరుకు పూర్తి కానున్నాయి. మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, సీతారాపురం, మర్రిపాడు, వరికుంటపాడు, వింజమూరు, దత్తలూరులలో ఎర్ర జగిద్యాల (మసూర) రకం ఎక్కువగా సాగు చేశారు. ఇతర ప్రాంతాల్లో 'ఏ' గ్రేడ్ రకం కెఎన్ఎం, సుగర్ లెస్, బిపిటితోపాటు 1001 రకం వేశారు. జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ప్రస్తుతం 298 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. అయితే, మిల్లులకు బ్యాంకు గ్యారంటీలు రాకపోవడం, కొన్ని కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు లేకపోవడం, మరికొన్ని చోట్ల ఉన్నా సరిగా పనిచేయకపోవడం, గోనె సంచులు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు కేంద్రాలు నామ్‌కే వాస్తుగా మారాయి. కొనుగోలు కేంద్రాలకు వెళ్లిన వారిని అధికారులు వెనక్కి పంపుతున్నారు. ఎకరా ఒక్కంటికీ సుమారు రూ.26,500 ఖర్చయింది. ఎకరాకు నాలుగు పుట్లు దిగుబడి రావాల్సి ఉండగా, ఈ ఏడాది తెగుళ్ల వల్ల 2.5 పుట్లు మాత్రమే వచ్చాయని రైతులు చెబుతున్నారు. పుట్టి ధాన్యానికి మద్దతు ధర రూ.19,720 ప్రభుత్వం ప్రకటించినా దళారులు రూ.16 వేల నుంచి రూ.18 వేలకు అమ్ముకోవాల్సి వస్తోంది. దళారులు నేరుగా కళ్లలోకి వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో, రైతులు నష్టపోతున్నారు. సంగం, కోవూరు, బుచ్చి తదితర మండలాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి. శ్రీరాములు డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ ఎండి అర్జునరావు మాట్లాడుతూ బ్యాంక్ గ్యారంటీలు వస్తున్నాయని, కొనుగోలు వేగవంతం చేస్తామని చెప్పారు.



వధూవరులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు

రాజేంద్రప్రసాద్ కుమార్తె నిశ్చయ తాంబూలాలకు సిఎం హాజరు

ప్రజాశక్తి-ఉయ్యూరు (కృష్ణా జిల్లా)

ఉయ్యూరు పట్టణంలో ఆదివారం జరిగిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవిబి రాజేంద్రప్రసాద్ కుమార్తె స్నేహ, రాజేశ్ నిశ్చయ తాంబూలాల కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా "పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఎం చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు హాజరయ్యారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, సుజనా చౌదరి, ఎపిఎస్ ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కొనకళ్ల బుల్లయ్య, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణ నిధి రూ.3వేల కోట్లకు పెంచాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధికి కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారని, నిధిని రూ.3 వేల కోట్లకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మిర్చి, కందులు, జొన్నలు, పత్తి, మొ క్కజొన్న, టమోటా, జీడిగింజల పంటల ధరలు పడిపోయాయని పేర్కొంది. ఇటువంటి స్థితిలో బడ్జెట్‌లో స్థిరీకరణ నిధికి తక్కువ మొత్తం కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.14,700 కోట్లు కేటాయించారని, ఆ నిధులను కూడా విడుదల చేయలేదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12,903 కోట్లు మాత్రమే నిధులు కేటాయించారని తెలిపారు. నిధులు పెంచాల్సిన తరుణంలో కూడా గతేడాదికన్నా రూ.2 వేలకోట్లు తగ్గించడంతో నిత్యం కరువు పీడిత ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తిచేస్తారో అంతుపట్టడం లేదని తెలిపారు. రాయలసీమ ఉత్తరాంధ్ర, వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులు పూర్తి కావాలంటే ఏటా రూ.25 వేల కోట్లు కావాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రబడ్జెట్‌లో వ్యవసాయ రంగంతోపాటు అనుబంధ రంగాలను కలిపి కేటాయించింది కేవలం 4శాతం మాత్రమేనన్నారు. బడ్జెట్ మొత్తంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు 10 శాతం నిధుల కేటాయించాలని ఎపి రైతుసంఘం డిమాండ్ చేసింది.

వరదలకు అస్తవ్యస్తమైన నీటి వనరులను, మురుగు కాల్వలను ప్రైవేటుకు అప్పగిస్తారో లేక ఏమి చేయాలనుకుంటున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్పొరేట్ బాటలోనే ఉన్నాయన్నారు. ధరల స్థిరీకరణ, సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో మాటలకు, కేటాయింపులకు పొంతన లేదని పేర్కొన్నారు. మామిడి పంటకు పంటల బీమా ఏర్పాటు చేస్తామని చెప్పినా ఉచిత బీమా పథకాన్ని రద్దు చేశారని, మామిడి బీమాపథకం ప్రీమియం రైతుకు భారంగా ఉందని తెలిపారు.

లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలి



ప్రజాశక్తి - పాలకొండ (పార్వతీపురం మన్యం జిల్లా)

శ్రామిక మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వీటి నిరోధానికి కమిటీలు వేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని ఆదివారం పార్వతీపురం మన్య జిల్లా పాలకొండలోని ఒక ప్రయివేట్ కల్యాణ మండపంలో హత్యలు, అత్యాచారాలు, మద్యం అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన స్థానం కల్పించాలని, చట్టం ముందు అంతా సమానులేనని భారత రాజ్యాంగంలో ఉన్నా.. ఇవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళా కార్మికులకు అన్ని విధాలా రక్షణ కల్పించే బాధ్యత ఆయా సంస్థలదేనని అన్నారు. ప్రయివేటు సంస్థలు, పరిశ్రమలు తదితరాల్లో పురుషులతో పాటు పనిచేస్తున్న శ్రామిక మహిళలకు రక్షణ కల్పించబడుతుందో లేదోనని పర్యవేక్షించాల్సిన ప్రభుత్వాలు ఈ విషయాన్ని ఏ మాత్రమూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళలు, విద్యార్థులపై వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాల నియంత్రణకు ఐక్య పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు హిమప్రభ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బి అమరవేణి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు జె సుందరమ్మ తదితరులు మాట్లాడుతూ మహిళల హక్కుల సాధనకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ర్యాలీలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సదస్సులో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రభావతి

తాడేపల్లిలో అరుదైన 'పునుగు పిల్లి'..

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)



తాడేపల్లిలో లాజర్ ఇంటిలో పునుగుపిల్లి

తిరుమల శేషాచలం అడవుల్లో కనిపించే అరుదైన పునుగు పిల్లి గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆదివారం ప్రత్యక్షమైంది. ముగ్గురోడ్డులోని గొట్టుముక్కల లాజర్ ఇంట్లో ఓ మూలన ఉన్న పునుగు పిల్లిని చూసి కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. దాన్ని చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చే వరకు పునుగు పిల్లిని బయటకు వెళ్లకుండా బుట్ట కింద బంధించి ఉంచారు. అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పునుగు పిల్లిని స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని చెప్పారు.

1.02 లక్షల మందికి కుట్టు మిషన్లు : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8 నుంచి మహిళలకు 90 రోజులపాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. 1,02,832 మందికి ఉచితంగా కుట్టు మిషన్లు అందించనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పూర్తి చేసుకున్న బిసి, ఇడబ్ల్యుఎస్, కాపు సామాజిక వర్గాల మహిళలకు కుట్టు మిషన్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వైద్య రంగానికి తగ్గిన కేటాయింపులు

బడ్జెట్‌పై ప్రజారోగ్యవేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వైద్య రంగానికి కేటాయింపులు తగ్గాయని ప్రజారోగ్య వేదిక తెలిపింది. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు పట్ల పూర్తి నిర్లక్ష్యాన్ని చూపుతుందని వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజారోగ్యం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాలు, రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం పరిశీలిస్తే రాష్ట్రప్రభుత్వం ఆరోగ్య రంగానికి కేటాయించిన నిధులు చాలా తక్కువగా ఉన్నాయని వివరించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు రూ.19,264.63 కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జిఎస్‌డిపి)లో 6శాతం ఆరోగ్య రంగానికి కేటాయించాలని డబ్ల్యూహెచ్‌వో సూచించిన దానికి పూర్తిగా విరుద్ధమని తెలిపారు. స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో 2.5శాతానికి పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల్లో తగినంత మౌలిక సదుపాయాలు లేవని, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడంలో ప్రభుత్వాస్పత్రులు అనేక ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటం వల్ల ఆరోగ్య వ్యవస్థ మరింత కుంటుపడి సకాలంలో సమర్ధవంతమైన వైద్యాన్ని అందించడంలో ఆటంకాలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు అవసరమైన అత్యవసర పెట్టుబడులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. డబ్ల్యూహెచ్‌ఓ సిఫార్సులను చేరుకోవడానికి జిఎస్‌డిపిలో ఆరోగ్య రంగానికి 6శాతం బడ్జెట్ కేటాయించాలని కోరారు.

ఎన్‌టిటిపిఎస్‌లో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రంలో కార్మికుడు మృతి చెందగా, మరో కార్మికుడు గాయపడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామవరప్పాడుకు చెందిన బుర్రా ప్రసాద్ (43), జి.కిషోర్‌బాబు ఎన్‌టిటిపిఎస్‌లోని స్టేజ్ 5 డిఎం వాటర్ ప్లాంట్ ట్యాంక్‌లో పెయింట్ వేస్తున్నారు. ఈ సమయంలో ఊపిరి ఆడక అస్వస్థతకు గురై ప్రసాద్ చనిపోయారు. ప్రసాద్‌ను రక్షించే క్రమంలో ట్యాంక్‌లో పడి కిషోర్‌బాబు గాయపడ్డారు. ఆయనను తోటి కార్మికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు తెలిపారు. వర్క్ మాన్ కాంపెన్సేషన్ యాక్ట్ అమలు చేసి కార్మికుని కుటుంబానికి రూ.25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు.



సభలో మాట్లాడుతున్న ఇఫ్టూ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్

ఆర్‌ఎస్‌ఎస్, బిజెపికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- ఇఫ్టూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలని ఇఫ్టూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని చందా సత్రంలో ఉభయ ఐఎఫ్‌టియుల రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ఎం.ఏసు ఆధ్వర్యంలో రెండు ఐఎఫ్‌టియుల విలీన సభ ఆదివారం జరిగింది. ఈ సభలో శ్రీనివాస్ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడుతూ.. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరిస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుండి లేబర్ కోడ్‌లు అమలు చేస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటిస్తోందని, నాలుగు లేబర్ కోడ్‌లు అమలైతే సమస్యల విషవలయంలో కార్మికులు చిక్కుకుంటారని, ఉపాధికి రక్షణ కరవవుతుందని తెలిపారు. ఈ విధానాలు పూర్తిగా కార్పొరేట్ల కోసమే మోడీ ప్రభుత్వం తీసుకువస్తోందని, వీటికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నారని, వాటికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు ముందుకొస్తున్నాయని తెలిపారు. ఆ పోరాటాల స్ఫూర్తితో దేశంలో కార్మిక వర్గం ఉద్యమాలకు ముందుకు రావాలని కోరారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ భారత్‌గా తీర్చిదిద్దుతున్న సమయంలో ప్రజలు దేశాన్ని కాపాడుకునేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎం.దుర్గాప్రసాద్ ప్రసంగించారు.

ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులుగా ప్రసాద్

సభ అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా పి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.పోలారితోపాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, అయిదుగురు కార్యదర్శులు, ఒక కోశాధికారి, 28 మంది కమిటీ సభ్యులను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సభా ప్రారంభానికి ముందు సుబ్రమణ్యం మైదానం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు.

జీడి మామిడికి మద్దతు ధర ప్రకటించాలి

- రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- 17న ఐటిడిఎ, కలెక్టరేట్ల వద్ద ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

కిలో జీడి మామిడికి రూ.200, 80 కిలోల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధరను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం ప్రకటించాలని, జిసిసి, ఆర్‌బికెల ద్వారా జీడి మామిడి పంట కొనుగోలు చేయాలని, జీడి మామిడి రైతుల అభివృద్ధికి జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విశాఖలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎపి రాష్ట్ర జీడి మామిడి రైతుల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానం జరిగింది. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సీదరి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జీడి మామిడి రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.మోహనరావు, ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం పార్వతీపురం, విజయనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో సుమారు లక్ష మంది రైతులు జీడి మామిడిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. జీడి మామిడి ఆధారిత పరిశ్రమల్లో ఇంకో లక్ష కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నట్టు తెలిపారు. 3.40 లక్షల ఎకరాల్లో 15 లక్షల మెట్రిక్ టన్నుల పంటను రైతులు పండిస్తున్నారని తెలిపారు. వారికి మద్దతు ధర దక్కకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాపారులు తక్కువ ధరకు జీడి మామిడి పంట కొనుగోలు చేసి రైతులను మోసగిస్తున్నారని తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 17న ఐటిడిఎ, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులు గండి నాయినబాబు, బిటి.దొర, బి.రాంబాబు, టి.అజయ్ కుమార్, టి.శాంతారావు, ఆర్.నాగరాజు, కె.రామస్వామి పాల్గొన్నారు.



సామ్యవాద పథమ్ము
సౌమ్యమైన విధమ్ము
సకల సౌఖ్యప్రదమ్ము
ఓ కూనలమ్మా ...

– ఆరుద్ర



చెమట పిడికిళ్లు

నువ్వు అమావాస్య కాటుక చీకటిని
పున్నమినాటి వెన్నెల వెలుగంటూ
నిస్సిగ్గుగా ప్రకటించగానే
నీ భజన మీడియా బాకా నోళ్లన్నీ
బాజా భజంత్రీలు వాయించి ఊదరగొడితే
అమాయకంగా నమ్మేసి మోసపోవటానికి
మేమ్మీ పశుమందిర్ నుంచి
ఊడిపడ్డ నిశాచర గణాలం కాదు!

నువ్వు ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో
మా రెక్కల సత్తువలోంచి రాలిపడ్డ రక్తాన్ని
కార్పొరేట్ తోడేళ్ల నోళ్ళకందించే
నికృష్టపు నల్ల చట్టాలు ఏర్చి కూర్చి
వాటికి తెల్ల కోరలు తగిలించి
ఇవిగో మీ చీకటి బతుకుల
వెన్నెల వెలుగులు! అంటూ
ఉబ్బేస్తే ఉబ్బిపోటానికి మేం
నీ వక్రీకరణ చరిత్రలోని పాత్రలకు మల్లే
జీవం లేని బొమ్మలం కాదు!

మాకు తెలుసు
నువ్వొక పైశాచిక నిచ్చెన మెట్ల
క్రూర వ్యవస్థకు ప్రతినిధిగా
కోరల్నీ కొమ్ముల్నీ కోటు జేబుల్లో దాచుకున్న
మనువాద రాక్షసుడివని!
మాకు తెలుసు
నిజాలకు భయపడి
ఇసుకలో తల దూర్చుకొని
మతాన్ని రాజకీయాలకు
ముడిసరుకుగా వాడుకుంటోన్న
నీతీ నిజాయితీ లేని పీతవని!

రాసి పెట్టుకో ..!
రానున్న రోజుల్లో
మట్టిలోంచి గుట్టలు గుట్టలుగా
చెమట పిడికళ్ళు పొడుచుకొస్తాయ్!
రాలిన మా కన్నీటి బొట్లే
నీ రాక్షస రాజ్యానికి
సమాధి రాళ్ళుగా ఘనీభవిస్తాయ్!!

– పతివాడ నాస్తిక్, 94417 24167

శ్వాసలుడిగిన కాలం

కాలమెప్పుడూ జీవితాన్ని
లొంగదీసుకుంటూనే ఉంటుంది
కన్నీరు మున్నీరవుతుంది
నీరసించిపోతుంది నెమ్మదిస్తుంది
ఎడారిలో పూలు పూసినట్లు
అప్పుడప్పుడు కాసిన్ని నవ్వులు
దోసిట్లో కుమ్మరించిపోతుంది

గాయాల లెక్కలు తేలవు
కొనగోటితో విదుల్చుకున్నా
సమస్యలు వెంటాడటం మానవు
ఉష్ణమండలమంత వేడికాదు కానీ
పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా లేదూ!
బూడిదైపోయింది సమానత్వమేనా!
నల్లదొరల బూటు కాలు చిదిమేసిన
అమ్మల పూల గుండెలు కాదూ!?

బలవంతంగానైనా నింగి నేలను చెరబట్టడమే
ఇప్పటి బహిరంగ నీతి
శరీరంపై పాకిన విషప్పురుగులకు
ఇప్పుడు ఎడతెగని స్వేచ్ఛ
చట్టసభల్లో మార్మోగుతున్న
సమానత్వపు బూతులను ఎవరైనా వినలేం కదా
సీసాన్ని కరిగించి చెవుల్లో పోసుకుంటామిక!

సమానత అంటే మెడలు వంచైనా
నడ్డి విరిచైనా సరే
ఆమె అనుభవించదగ్గ సౌకర్యమేనని
ఓ అసంబద్ధమైన తీర్పు
న్యాయానికి మానభంగం జరిగింది
కోర్టు మెట్లపైనే కుప్పకూలిపోతున్న న్యాయాన్ని
నిటారుగా నిలబెట్టేదెవ్వరు?!

చట్టానికి మీసాలు మొలిచిన కాలం కదా
బలవంతంగానైనా శ్వాస తీసుకోవాలిప్పుడు!

– వైష్ణవి శ్రీ, 8074210263

నగర చిత్రాలు

నగరం నడిబొడ్డున
రహదారుల పక్కన కొంగు పరిచి
తన కడగొట్టు బిడ్డలను
అక్కున చేర్చుకుంటుంది!

దిక్కులేని దీనులైనా
గూడులేని పక్షులైనా
వచ్చిపోయే జనం మధ్యలోనే
వారి జీవితాన్ని అల్లుకుంటారు,
జనమే వారి జీవనం
కాలమే వారి గమ్యం!
000
నగరంలోని మనుషులు
సంపాదన ఛత్రంలో పడి
వ్యాపారమత్తులోనే ఉంటారు,
ఆదమరిచావా
నిన్ను నీవే పోగొట్టుకుంటావు,
మేలుకున్నావా
వచ్చిన దారి గుర్తుండి తిరిగి పోతావు!

ప్రేమగానే పిలుస్తారు
ప్రేమతోనే దోచేస్తారు
నమ్మితే నట్టేట ముంచుతారు!

– పుట్టి గిరిధర్, 94949 62080

కవిసంధ్య - కవితల పోటీ ఫలితాలు

ప్రపంచ కవితా దినోత్సవ సందర్భంగా కవి సంధ్య, యానాం– చిన్ని నారాయణ రావు ఫౌండేషన్, నెల్లూరు సంయుక్తంగా నిర్వహించిన వచన కవితల పోటీ ఫలితాలు వచ్చాయి. ప్రథమ బహుమతి : వొంటరైన ఉమ్మడి తనం – డా. జడా సుబ్బారావు, నూజివీడు; రెండవ బహుమతి : తర్పణం –పర్కపల్లి యాదగిరి, సిద్దిపేట; మూడవ బహుమతి : నడిచిన పాదాలు – ఐలేని గిరి, దుబ్బాక గెలు పొందారు. వినోద్ గుత్తం, మోకా రత్న రాజు, జె. డి. వరలక్ష్మి, కళా గోపాల్, బి. వేణుగోపాల రెడ్డి, పొనుగు మట్ల అశోక్ కుమార్, బి.వి.శివ ప్రసాద్, పిన్నంశెట్టి కిషన్, తుమ్మల దేవ్‌రావ్, ఉదారి నారాయణ ప్రోత్సాహక బహుమతులు పొందారు. ప్రముఖ కవి కోడూరి విజయ్ కుమార్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. బహుమతి ప్రదానం ప్రపంచ కవితా దినోత్సవ సభ వేదికపై 23 మార్చి 2025, ఆదివారం, రవీంద్ర భారతి హైదరాబాద్ లో జరుగుతుంది.

– దాట్ల దేవదానం రాజు, శిఖామణి

కథల రారాజు మునిపల్లె

సందర్భం



"అయిదు వందల పేజీల నవల చదివిన తరువాత 'అబ్బే' ఏముంది ఇందులో అనుకోవలసిన సందర్భాలు ఎదురౌతుంటాయి. కాని మునిపల్లెరాజు కథల్లో ఏది చదివినా 'అబ్బో' ఇందులో ఎంత జీవితం చిత్రించాడీ రచయిత అనిపిస్తుంది. కథ అనే కెరటానికి వెనుక నుంచి అనంతమైన జీవన సముద్ర ఘోష వినిపిస్తుందంటారు" ప్రముఖ రచయిత మధురాంతకం రాజారాం. ఆయన మునిపల్లె రాజు గారి కథలకు చేసిన వ్యాఖ్యానం అక్షర సత్యం. 'మాజిక్ రియలిజం'తో కథలు రాసిన గొప్ప కథకుల్లో మునిపల్లె రాజు ఒకరు.

శతవసంతాలు దాటిన తెలుగు కథా ప్రయాణంలో 'కథ' సాధించిన పరిణిత అత్యంతావశ్యకరం. గురజాడ వారు ఏర్పరచిన నవీనమైన రూపరేఖా విలాసాలతో కథ నవ్య పోకడలు పోయింది– పోతున్నది. వీరి తరువాత నాలుగైదు తరాల కథకులు నాలుగు కాలాలపాటు గుర్తుంచుకోదగ్గ కథలను రాసి శిల్ప, వస్తుపరంగా సుసంపన్నం చేసారు. పరిపక్వమైన జీవన గాంభీర్యంతో మానవ జీవితాన్ని అత్యంత సహజంగా చిత్రించి సహస్ర ముఖాలుగా కథను ఆవిష్కరించిన గొప్ప 'కథల రారాజు' మునిపల్లె రాజు. ఓ తరం కథకుల కథలకు ఆయనో ప్రతినిధి. అత్యంత వేగంగా మారుతున్న మానవ సమాజ ముఖ చిత్రంతో విభిన్నమైన గమన మార్పులను రాజు గారి కథలు ఆవిష్కరించిన వైనం ఘనం. జీవితపు శతాబ్దాల శిధిలావస్థల చివరి మెరుపులు ఒక భావోద్వేగాన్ని, ఒక కరుణను, ఒక నిర్వేదాన్ని, ఒక ప్రశాంత వాతావరణాన్ని, ఒక వీడ్కోలు దృశ్యపు ఆర్ద్రానుభూతిని కలిగిస్తూ, దశ్యాదశ్యంగా ఉదయకాలపు మంచు తెర కరిగిపోతున్నట్టు, సాయంసంధ్యా సమయ నిశ్శబ్దం నిశీధిలో లీనమవుతున్నట్టు కాలం తన ప్రయాణాన్ని మౌనంగా చేతిలో ఇసుకలో జారిపోతున్న చిత్రాలు 'మనిషి' జీవితానికి అన్వయిస్తూ కొనసాగే రాజుగారి కథలు మరో కొత్త సమాజపు దారులకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి.

మునిపల్లె రాజు స్వగ్రామం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మునిపల్లె. 1925 మార్చి 16న జన్మించారు. ఈయన అసలు పేరు బక్కరాజు. తండ్రి హనుమంతరావు. తల్లి శారదమ్మ. మనిపల్లె, తెనాలి, పొన్నూరు, నిడుబ్రోలు ప్రాంతాలలో ఆయన విద్యాభ్యాసం సాగింది. తెలుగు పండితులు జమ్ముల మడక రామమూర్తి వలన సాహిత్యంలో అభిలాషను పెంచుకున్నారు. 1943 నుండి 1983 వరకు భారత ప్రభుత్వ రక్షణ శాఖలోని ఇంజనీరింగ్ విభాగంలో సర్వేయర్‌గా పనిచేసారు. దేశంలో వివిధ ప్రాంతాలు తిరిగారు. జీవిత భాగస్వామి సులోచనాదేవి. 69 కథలు, 'పూజారి' అనే నవల రచించారు. ఈ నవలనే 'పూజాఫలం' అనే చలన చిత్రంగా బి.ఎన్.రెడ్డి సినిమాగా తీసారు. 2004 గోపిచంద్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాలు, 2006 కేంద్ర సాహిత్య అకాడమీలతో పాటు మరెన్నో పురస్కారాలు రాజు గారికి లభించాయి.

రాజు గారి కథల్లో అర్ధమైన హదయార్ద్ర రీతిన సజనా కథా చిత్రాలు కనిపిస్తాయి. తన చుట్టూ ప్రపంచంలోని 'మనిషి' ఉనికి, అస్తిత్వ పోరాటాల నడుమ ప్రవత్తులను, పోరాటాలను అద్భుతంగా, అక్షరబద్ధం చేసారు. సామాన్యులే రాజుగారి కథల్లో ప్రధాన పాత్రలు. భాషపైన అధికారం, అపారమైన జీవితానుభవం, విస్తారమైన ప్రయాణ విజ్ఞానం, కథన కౌశలం, కథాశిల్ప మర్మజ్ఞత వంటివి ఆయన రచనల యొక్క విశిష్టతకు ప్రత్యేకాంశాలుగా నిలుస్తాయి. 'జర్నలిజం' గురించి వ్రాసిన వ్యాసాలలో సహితం కథనం చదువరులను ఆశ్చర్యచకితులను చేయటం గమనించవచ్చు. కథలు, నవలలో తన చుట్టూ ఉన్న వ్యక్తులనే పాత్రలుగా ఆయన మలుచుకున్నారు. తాత గారు, అమ్మ నాన్న, పెద్దనాన్న, స్నేహితులు అంతా ఆయన బంధుగణమే. 'తనకు తెలియని వ్యక్తుల గురించి తను కథ రాయలేనంటారు' ప్రముఖ కథకులు పాలగుమ్మి పద్మరాజు. ఈ 'రాజు 'గారిది కూడా ఇదే ఒరవడి. అయితే తన మనోపథంలో చిత్రించుకున్న చిత్రానికి తనకు నచ్చిన వర్ణాలనద్దుకోవడంలో ఏ చిత్రకారుని ప్రత్యేకత వారిదే. మునిపల్లె రాజు 'కథన కౌశలం' అద్భుతమైన వర్ణ చిత్రాల సౌందర్యం.

మానవ జీవితాలలో ప్రతి ఒక్కరికి తనదైన అనుభవ అంతరంగిక జీవితం కనిపిస్తుంది. 'అతడు అభిమానించే విలువలు పాటించాలని ఆశించే జీవన విధానమూ ఏ విధంగా ఉంటాయో సామాజిక జీవనానికి కూడా ఉదారభావ సాముదాయిక ఆదర్శ జీవన మూల్యాలు ఉంటాయి. ఆ సున్నితమైన మనః ప్రవత్తులను, ఆర్తిని ప్రాథమిక చిత్త వత్తులను, మానవుడి మనుగడను సార్థకము స్తుతి పాత్రమూ చేసే విలువలను ఆవిష్కరించడమే గొప్ప కథకుడి గొప్పతనమంటారు అక్కిరాజు రమాపతిరావు. మునిపల్లె రాజు గొప్ప కథకులు

ప్రతి మనిషి జీవితంలో చిక్కుముళ్ళూ అనేక ముంటాయి. వీటిని విడదీసుకుంటూ ముందుకు సాగటమే జీవిత పరమార్థమనే వారిలో మానవత్వ కరుణా ప్రపూర్ణమైన దక్పథమున్న రాజు గారు ప్రథమ వరుసలో ఉంటారు. ఆయన కథలలో కవిత్వముంది. వెన్నెలలో మబ్బులు ఎంతందంగా కనిపిస్తాయో, ఆనందాన్నిస్తాయో ఈయన కథల్లో వర్ణనలు కూడా అంతే స్థాయి రసస్ఫూర్తిని కలిగిస్తాయి. రాజుగారి కథలు పాత్రల అంతరంగ, బహిరంగ మూర్తిత్వాలు బలంగా, స్ఫుటంగా జీవసంస్పంద బంధురంగా కనిపిస్తాయి.

తెలుగు కథలలో సైనిక వృత్తి జీవితాల మీద వచ్చిన కథలు చాలా తక్కువ. ఆ లోటును తీరుస్తూ సైనిక పటాలాల కుటుంబ, వ్యక్తిగత, వత్తిగత సంవేదనలను, ప్రతిస్పందనలను ఒక విలక్షణమైన రీతిలో చిత్రించారు రాజు గారు. తన కలం నుంచి ఏ కథ వచ్చినా దానికొక సాహిత్య యోగము, ప్రయోజనము ఉండాలనేది ఆయన ఆశయం. పల్లెను చిత్రించినా, ముంబయి వంటి నగరాలను వర్ణించినా వాటి 'తత్వాలను' సాధికారికంగా చెప్పగల సాహితీ మూర్తి. తన చుట్టూ ఉన్న సమాజం, ఆ సమాజాన్ని నడిపించే సమూహాలను రాజు గారు అధ్యయనం చేసారు. అందుకే ఆయన కథల్లో 'జీవిత చేవ' పరిపుష్టంగా కనిపిస్తుంది. మునిపల్లె రాజు గొప్ప మానవతావాది. ఆయనకు మనిషి ముఖ్యం. నిండైన మానవీయతల, విశ్వజనీనత ఆయన రచనల లక్ష్యం.

(మార్చి 16 : మునిపల్లె రాజు గారి శత జయంతి)

– భమిడిపాటి గౌరీశంకర్,
94928 58395

సుధామ, చంద్రశేఖర ఆజాద్‌లకు పురస్కారాలు

కథాఋషి మునిపల్లె రాజు శతజయంతి సందర్భంగా 2023 సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త, సప్తపది లఘుకవితా ప్రక్రియ సృజనకర్త సుధామ గారికి, 2024 సాహిత్య పురస్కారాన్ని సుప్రసిద్ధ కథా, నవలా, సినీ రచయిత చంద్రశేఖర ఆజాద్ గారికి ప్రదానం చేయడానికి మునిపల్లె రాజుగారి కుటుంబసభ్యులు నిర్ణయించారు. ఈ పురస్కార ప్రదాన సభ మార్చి 17వ తేదీ సోమవారం సాయంకాలం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఎంవిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతుంది.


నిషేధించబడిన నవ్వులు

ముఖంపై నవ్వుల తీగలు
ఆకాశానికి పాకడం నేరమైన చోట
ఎర్రని గుండె
పచ్చ పచ్చగా హుంకరించాలి

నీ మాట ఎడారిలో ఇసుక పాము.
అదే ఎడారిలో నీటి కొలను నా నవ్వు.

ముఖంపై నక్షత్రాల లాంటి నవ్వులను చెరిపేసి,
శూన్యంలో మృత మాటలను కడితే
వెలుగు ఎలా అవుతుంది?
నీ మాటలు శ్మశానంలో
పురుగులు తిన్న పుర్రెలు,
ఆహ్లాదకరమైన వాతావరణాన్ని
హత్య చేసే ఇనుప ముల్లులు!

నా నవ్వులు
కొలనులో ఆత్మీయ పువ్వులు
వెలుగునిచ్చే తారజువ్వలు



చీకట్లో ధైర్యాన్నిచ్చే నీడలు!


నీ ప్రశ్న–
నవ్వులు ఎందుకని?
నా జవాబు–
చల్లని చిరునవ్వు!

– జాని తక్కెడశిల
72595 11956

ఇక్కడ 'నేను' బహువచనం

అతి సహజంగా ప్రతిస్పందించాల్సిన నేను
అత్తిపత్తి కన్న ఎక్కువగా
ముడుచుకుంటున్నాను
ఊసరవిల్లి సిగ్గుపడేటట్టు రంగులు
మారుస్తున్నాను
తన్మయత్వంతో తప్పటడుగులేస్తూ
పిచ్చి పట్టినట్టు పచ్చిగా పిడికిలెత్తి
నాలుగు కోతుల సందేశాలను
అపసవ్య దిశలో ఆచరిస్తూ ఆనందిస్తున్నాను

ఆరు కిలోల ఆకలిభత్యం అందక
ప్రాణాలు బాసిన పసి వలసజీవి
ఆక్రందనలు చూడలేక ముఖం చాటేస్తున్నాను
పుణ్యం పోగేసుకునే తొందరలో
పాదాల కింద ఊపిర్లు పోతున్నా
పట్టించుకోక పాప పంకిలంలో మునుగుతున్నాను




చరిత్రనంత అసంగతంగా వక్రీకరిస్తూ
చలనచిత్రాలు చిత్రిస్తున్నా
ఏ చలనం లేకుండా మౌనంగానే చూస్తున్నాను
జాతి గౌరవానికి ప్రతీకనైనట్టు నటిస్తూ
ఉక్కు సంకెళ్లను కాలు చేతులకు తగిలించిన
బెల్లం కొట్టిన రాయిలా గమ్మునుంటున్నాను
అక్షరాలు ఎరుపు రంగేసుకుని
వార్తలుగా పత్రికల్లో ప్రత్యక్షమవుతుంటే
సానుభూతితో కన్నీరు కార్చలేకపోతున్నాను

బతుకెవ్వరిది? బాధ్యత ఎవరిది?
భ్రమలెవ్వరివి? భయమెందుకో తెలియక
తికమకగా బెత్తరి చూపు చూస్తున్నాను
మెదడు బావిలో పాతాళ గరిగేసి వెతికినా
ఒక్క ప్రశ్నా చిక్కడం లేదు !
బహుశా నేను మనిషిగా మరణించి
బండరాయిలా బతుకుతున్నానేమో?

– డా.ఎడ్ల కల్లేశ్
98667 65126

అమాయకుల 'రక్తతర్పణం'

పుస్తకం



పుష్ప సినిమా పుణ్యమా అని ఎర్రచందనం చెట్ల పరిరక్షణ పట్ల చైతన్యం పెరుగుతుందేమోనని భావించాను, కానీ అది జరగలేదు. సినిమాలో నరకబడ్డ దుంగల రక్తం కాస్తా నిర్మాతలకు, ప్రేక్షకులకు తమ తమ వంతుగా కలెక్షన్లు, వినోదం కావాల్సినంత ఇచ్చింది. అయితే ఈ కథలేవి ఎక్కడో మారుమూల అడవుల్లో మనుగడ సాగించే ఎర్రచందనం చెట్లకు చేరలేదు. ఎర్ర వృక్షమేధం నిరాఘాటంగా కొనసాగుతూనే ఉంది. పుష్ప సినిమాలో చూపించినట్లు పోలీసులు, అటవీ అధికారులు, న్యాయ నిపుణులు, పత్రిక లోళ్ళు అంటీ అంటనట్లుగా మిగిలి పోయారు.

ఫిబ్రవరి తొలి వారంలో తిరుపతి పుస్తక ప్రదర్శనలో ఒక స్టాల్‌లో ఎర్ర చందనం పుస్తకం చూశాను. రచయిత డాక్టర్ వి ఆర్ రాసాని. ఆయన నాకు మంచి మిత్రుడు, సృజన శీల రచయిత. ఆ పుస్తకాన్ని తక్షణం కొనుక్కున్నాను. తమిళనాడు నడిమి భాగం నుంచి ఒడిస్సా చివరి వరకు విస్తరించిన తూర్పు కనుమల్లో అంతర్భాగం శేషాచలం. శేషాచల కొండల శ్రేణికి గరిమనాభి తిరుమల. తిరుమలకు అటు పశ్చిమాన భాకరాపేట, తలకోన అడవులు, ఇటు తూర్పున ఉమ్మడి కడప జిల్లా మామండూరు–కుక్కల దొడ్డి అరణ్యాలు ఆలంబన. జాలారి, మద్ది, తంబ, జువ్వి చెట్లతో పాటు ఎంతో విలువైన, విలుప్త ప్రమాదంలో ఉన్న ఎర్రచందనం చెట్లకు ఆలవాలం. అడవి సమీప గ్రామాల్లోని యానాదుల్లో ఎరుకల ఇతర నిమ్నస్థాయి కులాలు, వర్గాలవారికి అడవే జీవనాధారం. ఆచార వ్యవహారాలు, ఆహార సంపాదన, ఆరోగ్య మూలికలు, ఆవాస పరికరాలకు అడవులతోనే ఎక్కువగా ఆత్మీయ అనుబంధం.

ఈ నేపథ్యంలో రచయిత రంగ ప్రవేశం చేస్తాడు. తనకున్న పరిసర పరిజ్ఞానాన్ని, అధ్యయన అంశాల్ని, ఎత్తుగడ రీతుల్ని చేత పట్టుకుని ఎర్రచందన కథా సామ్రాజ్యంలోకి ఒక అనామకున్ని ప్రవేశపెడతాడు. తలకోన సిద్ధేశ్వరాలయంలోకి వెళ్లి దేవుడికి దండం పెట్టుకుని నెత్తిన బుట్ట పెట్టుకొని ఓ ఆగంతకుడు అడవి దోవ పడతాడు. 12 అంతస్తుల ఎత్తున నెత్తి మీద దూకుతున్నట్లుండే తలకోన జలపాతపు ఈవడి పక్క నుంచి లాఘవంగా ఎగువ ఝరివైపునకు దారి తీస్తాడు. నక్కలు, రేచుకుక్కలు, కొండచిలువలు, తేనే పెరలు, అడవి మామిడి, వేగి చెట్లు, లతలు, తీగలు, కొమ్మలతో కూడిన వన వర్ణన అంతా తన మదిలో మెదులుతుంది. అంతలోపు అడవిలో పాముకాటుకు గురై నోట నురగలు గక్కుతున్న సందర్శకున్ని తన అరణ్య అనుభవంతో కాపాడి అతడి సమూహం మెప్పు అందుకుంటాడు.

తలకోన శిఖరాగ్రం మీది మైదానం చేరుకుంటాడు. ఇంతలో ఏదో చప్పుడు... అరుపులు కేకలు... పరిగెత్తడాలు. ఢాం! ఢాం! అంటూ తుపాకీ కాల్పులు. ఏం జరిగిందో తెలుసుకునే లోపు ఎర్రకోట్లు దొంగల్ని తరుముతున్న పోలీసులు పేల్చిన తుపాకీ తూటా నేరుగా ఒంటరి వ్యక్తిని తాకింది. చోద్యం చూస్తున్న వాడు పిడుగుపాటుకు విరిగిపడ్డ మానల్లే అట్లే కూలబడిపోయాడు. అంతే! ఇక అసలు కథ మొదలవుతుంది.

ఆ చచ్చిపోయిన మనిషి ఎవడు? ఎర్ర దొంగల తాలూకానా? లేక ఇంకెవరన్నానా? ఆ మరునాడు పేపర్లో ఎన్‌కౌంటర్ శవం ఫోటో చూసి అనుమానం వేసిన ఆడోళ్ళు తమ పెనిమిటిని వెతుక్కుంటూ భయంతో శవం దగ్గరికి వచ్చేవారిని అక్కడి కావలి పోలీసులు గదమాయించి వివరణ నిమిత్తం మరలా భాకరాపేట పోలీస్ స్టేషన్‌కు కదిలిస్తుంటారు. ఇక అంగబలం, అర్థబలం లేని అమాయక జనుల పట్ల పోలీసు అటవీ అధికారుల ఆదరణ తెలిసిందే కదా!


శవం కేంద్రంగా నడిచే కపట నాటకాన్ని రచయిత ఎంతో చాకచక్యంగా చిత్రించాడు. రాజకీయ నాయకుడి అనుంగు సహచరుడు, పోలీసులు, అటవీ యంత్రాంగం, యానాదులు పరస్పర సంబంధమైన దృష్టాంతాల్ని తన కథాకథన శైలితో మనల్ని కట్టిపడేస్తాడు. ముఖ్యంగా యానాదులు ఊదరబెట్టి పొలాల్లో ఎలుకల్ని పట్టడం ద్వారా రైతు నేస్తంగా ఆకాసాన్నుంచి వేలాడేటట్లుండే కొండపేటులకంటిన తేనెపెరల్ని కొట్టే పద్ధతిని, స్థానిక మూలికా మొక్కల నైపుణ్యాన్ని, అడవితో ఆత్మీయతను బహునేర్పుగా నొక్కిచెబుతాడు.

చివర్లో ఆ చచ్చిన మనిషి తన మొగుడు పుసకడేనని గుర్తిస్తుంది పసిబిడ్డ తల్లి యానాది ఎంకమ్మ. బిడ్డను భుజానకు వేసుకొని కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంది. ఆ తరువాత పొరుబాటుగా పుసకన్ని కాల్చిన ఓ కానిస్టేబుల్ ఎర్రచందనం స్మగ్లర్ల చేతిలో అసువులు బాస్తాడు. కొందరు రాజకీయ పెత్తందార్ల భరోసా వున్నంత కాలం అవినీతి అధికారుల అండదండలు వున్నంతకాలం ఎర్రచందనం స్మగ్లింగ్ అడ్డుకట్ట పడదు. అదో ఆగని రక్త తర్పణం. నడుమ ఈ రాజకీయ జూదంలో పోలీసులు, ఫారెస్టోళ్ల మరీ ముఖ్యంగా పుసకడు లాంటి అడవిబిడ్డలైనా అమాయక యానాదులు, గిరిజనులు బలి పశువులు. పరిమాణంలో చిన్నదే అయినా ఈ నవల ఎర్రచందన మానులతో ముడిపడ్డ ఒక వాస్తవిక జీవితాన్ని ఆవిష్కరిస్తుంది. గుండెలు పిండే కఠోర పాఠాలను బోధిస్తుంది. అంతిమంగా ఇందులో అసలు సిసలు బాధితులు ఎవరయ్యా అంటే యానాది పుసకడు లాంటి ఎర్రచందనం అనే సజీవ తరుప్రాణి. అసలైన లబ్ధిదారులు, ఇంకెవరు? మన కరుడు గట్టిన కొందరు రాజకీయ హంతక జీవులు. ప్రతులకు : డా. వి.ఆర్.రాసాని, చరవాణి : 98484 43610.

– బి.వి.రమణ, సీనియర్ జర్నలిస్టు

తాత్విక భూమికపై అల్లుకున్న 'నిర్వేదం'

పుస్తకం



శ్రీరామకవచం సాగర్ రచించిన నిర్వేదం 167 పేజీలు, 11 అధ్యాయాల నవల. దీనికి సీనియర్ జర్నలిస్ట్ తాడి ప్రకాశ్ ముందుమాట రాశారు. ఈ నవలను కవి, రచయిత చిన్న నారాయణరావు గారికి అంకితం ఇచ్చారు. ఏదైనా సాహిత్య ప్రక్రియకు ప్రారంభం, ముగింపు ఓ ఆయువు పట్టులాంటివి. ఈ నవలలో రచయిత 'ఇప్పుడే కాలిమీద ఓ దోమ కుట్టింది' అని ప్రారంభిస్తాడు. శేషాచలపతి ఒక డాక్టరు, పరిశోధకుడు. తన పరిశోధన అంతా కూడా సముద్రంలోనే సాగుతుంది. ఈ విశాల ప్రపంచంలో అనేక వైద్యరీతులు, మందులు, బిళ్లలు ఉన్నప్పటికి ఎలాంటి వైద్యఖర్చులు లేకుండా రోగం ఇట్టే నయమయ్యే మందును కనిపెట్టాలనేది డాక్టర్ శేషాచలపతి తాపత్రయం. కవిగా, బైరాగిగా, జ్యోతిష్యుడిగా ఓ పేరు మోసిన, చేయి తిరిగిన వైద్యుడిగా ఉంటూ ఒక్కసారిగా నిర్వేదంలోకి వెళ్ళిపోయి ఓ సాధువుగా, ఓ బికారిగా ఉండాలనుకుంటాడు.

ఈ నవలలో రచయిత సాగర్ పాఠకుల కళ్ళముందు వివిధ దృశ్యాలను సృష్టిస్తుంటాడు. అవి అదృశ్యమైపోతుంటాయి. మరలా ఓ ఊడుముల చెట్టులా, ఓ బెత్తం స్వామిలా దర్శనమిస్తుంటాడు. పేరుకే 'నిర్వేదం' కానీ, ఈ నవల బాగా పరిచయస్తుల సంభాషణలా ఉంటుంది. సజీవ సన్నివేశాలు, సజీవపాత్రలు పాఠకులకు తారసపడతాయి. ఓ సీతాకోక చిలుక, కొన్ని నీడలు, వర్షించని మేఘాలు, ఓ కట్లపాము, ఓ నల్ల కుక్క దర్శనమిస్తాయి. ప్రకృతిలో పాఠకులను మమేకం చేస్తాడు రచయిత.

కథలో డా. శేషాచలపతి ఒక యోగిగా కరువుప్రాంతమైన కనిగిరిలో అడుగుపెట్టాడు. నేను బైరాగిని కాదు సంచారిని అంటాడు. పోస్టాఫీసు కూడలిని తాత్కాలిక నివాసంగా ఎంచుకున్నాడు. రైతులుగా ఉన్న మల్లయ్య, ఓబులేసు వ్యవసాయంలో నష్టమొచ్చి, అప్పులు తీర్చలేక కుటుంబ భారాన్ని మోయలేక బైరాగులై సంచి తగిలించుకొని కనిగిరి మఠం దగ్గర రాత్రుళ్ళు పడుకోడానికి నివాసం ఏర్పరచుకున్నారు. మహిళా రైతు చుక్కమ్మ కూడా అంతే! వ్యవసాయంలో దెబ్బతిన్న వాళ్ళంతా ఒక చోట చేరి బైరాగుల్లా బతుకు ఈడ్చే విదానాన్ని రచయిత చక్కగా పట్టుకొచ్చారు. సమాజం అట్టడుగు పొరల్లోకి వెళ్ళి సమాజ స్థితిగతులను నిశితంగా పరిశీలించినట్లు ఈ నవలలోని కొన్ని సన్నివేశాలను చదువుతుంటే అర్థమవుతుంది.

ప్రధానంగా డా॥ శేషాచలపతి ఒక ప్రేమికుడు, తాను సక్కుబాయితో ప్రేమలోపడి, విఫలమైన తర్వాతనే నిర్వేదంలోకి వెళ్ళినట్లు మనకు అర్థమవుతుంది. ఇద్దరి కులాలూ ఒకటి కానందునే సక్కుబాయి దూరమై, తనలో ఈ నిర్వేదం నాటుకుపోయిందని ఆత్మీకరించుకున్నాడు శేషాచలపతి.

"లోకంలో ఎందరో ప్రేమికులు. తొలి ప్రేమని దక్కించుకునే వాళ్ళు కొందరే కాని ఆ ప్రేమ క్షణికంగా పారేసుకున్న జంటలూ చాలామంది ఉంటారు. కానీ తొలి ప్రేమ చావదు. నిత్యం బతికే ఉంటుంద"ని రచయిత నిలిచిపోయే వాక్యాలను నిర్వచించాడు. శేషా చలపతి తాను డాక్టరయ్యుండి తోటి డాక్టర్ల మోసాలను తిప్పికొట్టాడు. రోగి ప్రశ్నలు వేస్తే విసుక్కుంటా సమాధానాలు ఇచ్చే మన సోదరులని చూసి జాలిపడటం తప్ప మనమేమి చేయలేమని డాక్టర్ల దుర్నీతిని స్పష్టంగా ఎండగట్టాడు. రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి కనుకనే ఆయన వైద్య వృత్తిని, వైద్యుల ప్రవృత్తిని కళ్ళకు కట్టినట్టు నిర్వేదం నవల ద్వారా మన ముందుంచారు.

తన దగ్గర ఆర్‌యంపిగా పనిచేసిన జమ్మయ్య, అతని సహచరి ఎంతో ప్రేమగా నటించి మద్యాన్ని ఎరవేసి మత్తులో దించి తన కిడ్నీని బేరాన్ని కుదుర్చుకొని, తన్ను మనోరమా తెలివిగా లొంగదీసుకున్నట్టే జమ్మయ్య ఓ మత్తుమందు ఇంజక్షన్ ఇచ్చి డా॥ శేషాచలం గాఢనిద్రలో ఉండగా డాక్టర్ శరీరాన్ని జమ్మయ్య ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఉన్న ఫలంగా డా॥ శేషాచలపతి శరీరాన్ని హైదరాబాద్ తరలించడం జరిగింది. జమ్మయ్య, అతగాడి సహచరి ఎత్తుగడలను రచయిత సాగర్ నేర్పుగా వివరించడంలో సఫలమయ్యారు. రచయిత ఉద్యమ నాయకుడు కనుక, జైళ్ళ, చట్టాలు, వాటి తాలూకా సెక్షన్లు వెళ్ళ మీద చెప్పగలడు. తప్పు చేసిన ఆర్.యం.పి. జమ్మయ్య కిడ్నీ రాకెట్ నడుపుతున్న సంస్థలను వదిలేసి, డా॥ శేషా చలపతిపై అక్రమ కేసులు బనాయించి, బెయిలు కూడా రాకుండా వేధించడం; అదే క్రమంలో ఓ రాజకీయ నాయకుడైన దొంగకి సకల సౌకర్యాలు గల బ్యారక్ ఇచ్చి గౌరవించడం వర్తమాన భారతాన్ని చిత్రించినట్టుగా ఉంది. తరువాత డాక్టర్ శేషా చలపతి కొత్తపట్నంలోనే తిరిగి డాక్టర్‌గా ప్రాక్టీస్ మొదలు పెడతాడు. సామాన్యులకు అండగా ఉంటాడు. ఇది అందరూ చదవాల్సిన గొప్ప మార్మిక నవల. పాఠకుడు నవలలోకి ప్రవేశిస్తే ముగింపు వరకు ఎక్కడా విడిచిపెట్టడు. వెల రూ. 200.

– దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి

20 ఎకరాల్లో మిరియాలు, కాఫీ తోటలు దగ్ధం

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ తలిబ గ్రామంలో 20 ఎకరాల్లో కాఫీ తోటలు దగ్ధమై రైతులకు నష్టం వాటిల్లిందని ఈ పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి తెలిపారు. ఆయన పాడేరులో విలేకరులతో మాట్లాడుతూ, కొండలకు నిప్పు అంటుకుపోవడంతో సుమారు 14 వేల కాఫీ మొక్కలు, నాలుగు వేల మిరియాల మొక్కలు పూర్తిగా దగ్ధమయ్యాయని చెప్పారు.

1/70 అమలుపై అసెంబ్లీలో ప్రకటన చేయాలి

- 6, 7 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ, ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 6, 7 తేదీల్లో ఐటిడిఎ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని ఆదివారం పాడేరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నిర్ణయించింది. చట్టసవరణలపై రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఐక్యవేదిక నిర్వహించిన 48 గంటల బంద్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి 1/70 చట్టం రద్దు చేసే ఆలోచన లేదని ఎక్స్ వేదికగా ప్రకటించడాన్ని హర్షిస్తున్నామన్నారు. మరోవైపు ఆదివాసీ ప్రాంతంలో ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో ఆదివాసీ ప్రాంతం అడవులంతా అదాని, అంబానీలకు కట్టబెట్టి ఆదివాసులను నిర్వాసితులు చేసేందుకు కుట్ర జరుగుతోందని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నేతలు పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో 1/70 చట్టంపై అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమైన ప్రకటన చేయాలని ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రామకృష్ణ, బూడిద చిట్టిబాబు, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో జిఒ 3 కనీసం ప్రస్తావన చేయలేదన్నారు. ఈ జిఒకు చట్టబద్దత కల్పిస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పారని, ఆదివాసి ప్రాంతంలో ఆదివాసులకు ఉద్యోగాలు ఉండేలా చూస్తామని అరకు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని గుర్తు చేశారు. వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని, బడ్జెట్లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్‌కు రూ.17 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజన సలహా మండలిని వెంటనే నియమించాలని కోరారు. ఏజెన్సీలో బినామీ, వ్యవస్థను అరికట్టడానికి, వలస నిరోధక చర్యల కోసం అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్న పడాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.



జల్లికట్టులో అపశృతి, పలువురికి గాయాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలోని జాలరపల్లిలో ఆదివారం నిర్వహించిన ఎద్దులు పరుగు పందెం(జల్లికట్టు)లో అపశృతి చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నించి పలువురు గాయపడ్డారు. మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలోని జాలరపల్లిలో జల్లికట్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతి 50 వేల ఒక రూపాయి ప్రకటించారు. ద్వితీయ బహుమతి 40 వేలు ప్రకటించడంతో యువకులు కేరింతలతో ఎద్దులను అడ్డుకునేందుకు పోటీ పడ్డారు. జన సమూహంలో ఎద్దుల పరుగులతో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా యువకులు కేరింతలతో ఎద్దులపై చేతులు వేస్తూ పట్టుకునేందుకు యత్నించారు. ఈ సందర్భంగా బైరెడ్డిపల్లి మండలానికి చెందిన రమేష్, కర్ణాటకకు చెందిన సుధాకర్, తమిళనాడుకు చెందిన మురుగేష్ ఎద్దుల పరుగు పందెంలో భాగంగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం108 సాయంతో బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి నాలుగు గంటల వరకు నిర్వహించిన ఎద్దుల పండుగలో మొట్టమొదట చింతమాకులపల్లి పాతూరు నాథం గ్రామాలకు చెందిన ఎద్దులు పౌరుషంతో పరిగెత్తడంతో మొదటి ప్రైజ్ 50 వేలు, ద్వితీయ బహుమతి 40 వేలు రెండు ఎద్దుల యజమానులకు కలిపి గ్రామస్తులు అందించారు. అనంతరం పరుగు పందెంలో గెలుపొందిన 36 ఎద్దులకు ప్రకటించిన బహుమతులు గ్రామస్తులు అందించారు.



చిత్రకారులను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ శ్రీనివాసన్

ముగిసిన గిరిజన చిత్రకారుల సదస్సు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, మాన్సాస్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'ఆదిచిత్తర :నేషనల్ ట్రైబల్ పెయింటర్స్ కాన్‌క్లేవ్' పేరుతో విజయగనరం కోటలోని రౌడ్‌మహాల్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ గిరిజన చిత్రకారుల సమ్మేళనం విజయవంతంగా ముగిసింది. ఆదివారం జరిగిన ముగింపు సభలో రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కార గ్రహీత దుర్గాబాయి వ్యయం, 12 రాష్ట్రాల నుంచి 26 రకాల గిరిజన చిత్రకారులు పాల్గొన్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చిత్రకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గోండ్, వార్లీ, పిథోర, కోలం, సోహ్రాయ్, ఖోవర్, కోయ, కురుంబా, తంగ్‌ఖుల్-నాగా, నాయకపోడు, సవర, సౌరా, మురియా, భిల్, మరిన్ని వంటి విభిన్న కళారూపాలకు ప్రాతినిధ్యం వహిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన చిత్రకారులను సదస్సు ఐక్యం చేసిందని ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా తెలిపారు. విద్యార్థులు గిరిజన సంప్రదాయ కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో మహారాజా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ బిఎస్ఎన్ రాజు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రమాఛటర్జీ, అప్పసాబ, వెంకటేశ్వర్లు, నగేష్, దేబంజన నాగ్, దివ్య, ఎన్‌విఎస్ సూర్యనారాయణ, కుసుమ్, తదితరులు పాల్గొన్నారు.

జనం అడుక్కోవడానికి అలవాటుపడ్డారు

- మధ్యప్రదేశ్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు
- హామీలను గుర్తు చేస్తే బిచ్చగాళ్లంటారా? : కాంగ్రెస్ ఆగ్రహం


భోపాల్ : బిజెపి సీనియర్ నాయకుడు, మధ్యప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాజగఢ్ జిల్లాలో వీరాంగన రాణి అవంతీబాయ్ లోధీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ప్రహ్లాద్ పటేల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వం నుంచి అడుక్కుని తీసుకునేందుకు ప్రజలు అలవాటుపడ్డారు. నాయకుడు వచ్చినప్పుడల్లా వారికి గంప నిండుగా అర్జీలు ఇస్తుంటారు. స్టేజీలపైన నాయకులకు పూలమాలలు వేసి, చేతుల్లో అర్జీలు పెడుతుంటారు. ఇది మంచి అలవాటు కాదు. ఇలా అర్థించే బదులు ఇచ్చే అలవాటును పెంపొందించుకోవాలి. దాంతో సమాజంలో సంస్కారం పెరగడంతోపాటు జీవితం ఆనందమయం అవుతుంది. చేయిచాచే వారివల్ల సమాజం బలహీనమవుతుందని, ఉచితాలకు ఆకర్షితులు కావడం ధీర మహిళల లక్షణం కాదు.. నిజమైన దేశభక్తులు చేయిచాచి అర్థించినట్టు మనం ఎక్కడైనా విన్నామా..?' అని వ్యాఖ్యానించారు.

ప్రజలపై అనుచిత వ్యాఖ్యలా?

ప్రజల సంపదను కార్పొరేట్లకు రాయితీల పేరుతో దోచిపెడుతూ, సమస్త వనరులను కారుచౌకగా కట్టబెడుతూ... ఉచితాల పేరుతో తరచూ ప్రజల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న బిజెపి నేతలు, మంత్రుల వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు జీతూ పట్వారీ స్పందిస్తూ రాష్ట్ర ప్రజలను మంత్రి అవమానించారని అన్నారు. ప్రజలను బిచ్చగాళ్లు అనే స్థాయికి బిజెపి అహంకారం పెరిగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తే బిచ్చగాళ్లంటూ అవమానిస్తారా అని విమర్శించారు. త్వరలో బిజెపి నాయకులు ఓట్లు అడుక్కుంటూ వస్తారని, అప్పుడు ప్రజలు గుణపాఠం చెప్పాలని అన్నారు.

ఇంటి వద్దే పాఠాలు!

- హోమ్ స్కూలింగ్‌కు పెరుగుతున్న ఆదరణ
- సమస్యలూ ఉన్నాయంటున్న విద్యావేత్తలు



న్యూఢిల్లీ : ఇంటి వద్దే పాఠాలు...ఇదేమిటి అనుకుంటున్నారా? ఇప్పుడు మన దేశంలో ఈ ధోరణి బాగా పెరిగిపోతోంది. సంప్రదాయపరంగా చిన్నారులను పాఠశాలకు పంపకుండా ఇంటి వద్దే వారికి విద్యను అందించడమే ఈ 'హోమ్ స్కూలింగ్'. ఈ విధానంలో తల్లిదండ్రులు లేదా గార్డియన్స్ నేరుగా పిల్లలకు విద్యను బోధించే బాధ్యతను తీసుకుంటారు. పాఠశాలకు వెళ్లి గంటల తరబడి తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినాల్సిన పనే ఉండదు. తల్లిదండ్రులు, పిల్లల సమయానుకూలాన్ని బట్టి విద్యా బోధన జరుగుతుంది. పిల్లలు తమ అభిరుచులను బట్టి నేర్చుకోవచ్చు. ఇది మన దేశంలో చట్టబద్ధమే. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఒఎస్), ఈ-పాఠశాల వంటి వేదికలు హోమ్ స్కూలింగ్‌కు మద్దతుగా పనిచేస్తున్నాయి.

ఇటీవల కాలంలో చాలా మంది పిల్లలు కూడా హోమ్ స్కూలింగ్‌నే ఇష్టపడుతున్నారు. హడావిడిగా నిద్ర లేచి ఉరుకుల పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులకు కూడా తొందర ఏమీ ఉండదు. తాపీగా పనులు చేసుకోవచ్చు. ఉదయం లేచి లేవగానే స్కూలుకు పోవడానికి తయారవ్వాల్సిన పని ఉండదు. ఆటలు ఆడుతూ, మ్యూజిక్ వింటూ, బొమ్మలు గీస్తూ ఇష్టమొచ్చినప్పుడు హాయిగా చదువుకోవచ్చు. రోజులో ఎప్పుడైనా చదువుకోవచ్చు. తల్లిదండ్రులే తొలి గురువులు. పుస్తకాల మోత అనేదే ఉండదు. చెమటలు కక్కుకుంటూ, వానలో తడుస్తూ, చలికి వణుకుతూ స్కూలుకు పోనక్కర్లేదు. ఇదంతా ఊహాజనితం అనుకుంటున్నారా? లేదు. నమ్మండి...నమ్మకపోండి...చాలా మంది పిల్లలకు ఇది వాస్తవం. మన దేశంలో ఇప్పుడిప్పుడే ఈ తరహా విద్యాబోధనకు ప్రాచుర్యం పెరుగుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు సైన్స్, గణితం, ఆంగ్లం బోధించవచ్చు. అంతేకాదు...జీవిత పాఠాలూ నేర్పవచ్చు. నిండా మూడేండ్లయినా నిండని చిన్నారుల్ని డేకేర్, ప్రీ-స్కూల్‌కు పంపితే చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. అప్పటి వరకూ తల్లిదండ్రుల ముద్దుముద్దుపాల నడుమ పెరిగిన బాలబాలికలు ఒక్కసారిగా వారికి దూరమై వేరే ప్రపంచంలో అడుగు పెడితే ఎలా ఉంటుంది? 'ఆ వయసులో కనీసం సరిగా తినడం కూడా తెలియదే. అలాంటిది డేకేర్‌లో, ప్రీ-స్కూల్‌లో తోటి పిల్లల రణగొణధ్వనుల మధ్య ఏడుపుల పెడబొబ్బల మధ్య వారు ఎలా ఉంటారు? చిన్నారులకు విద్యా బోధన ఇలాగేనా మొదలయ్యేది? కాదు. అందుకే మేము ఇంటి వద్దే మా పాపకు చదువు చెప్పుకుంటున్నాము' అని ఓ మహిళ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఇప్పుడు పిల్లల్ని పాఠశాలలో చేర్పాలంటే అదో పెద్ద ప్రహసనంగా మారిపోయింది. అడ్మిషన్ దొరకాలంటే ప్రవేశ పరీక్ష రాయాలి. ఆ తర్వాత ఇంటర్వ్యూకు వెళ్లాలి. ఈ తంతంతా చూసి పిల్లల్లో ఉత్సాహం నీరుగారిపోతోంది. స్కూలు అంటేనే భయం పట్టుకుంటోంది. ఇక పాఠాలు ఎలా నేర్చుకుంటారు? భయానక వాతావరణంలో ఎలా చదువుకుంటారు? ఇదంతా చూసి విసిగిపోతున్న తల్లిదండ్రులు హోమ్ స్కూలింగ్ వైపు మొగ్గు చూపుతున్నారనడంలో అతిశయోక్తి లేదు. అయితే ఇంటి వద్దే విద్యాభ్యాసాన్ని ఎలా కొనసాగిస్తారు అనే సందేహం కలగక మానదు. హోమ్ స్కూలింగ్ అనేది అన్ని కుటుంబాలలో ఒకేలా ఉండదు. తమ పిల్లలు ఎలా నేర్చుకోవాలని తల్లిదండ్రులు అనుకుంటారో దానిని బట్టే అది ఉంటుంది. కొందరికి నిర్దిష్ట పాఠ్యాంశాలు అంటూ ఏవీ ఉండవు. 'పిల్లలకు నడక ఎవరు నేర్పారు? వారు తమంతటతామే నేర్చుకుంటారు. వారికి మనం ఎందుకు ఆంక్షలు విధించాలి? ఒత్తిడి పెంచాలి?' అని సుభద్ర అనే మహిళ ప్రశ్నించారు. పిల్లలు ఇప్పటి వరకూ పాఠశాలకు వెళ్లకపోయినా ఆంగ్లంలో చక్కగా మాట్లాడుతున్నారని, వివిధ ప్రదేశాలు తిరుగుతూ చరిత్రను గురించి తెలుసుకుంటున్నారని, క్రికెట్ ఆడుతూ స్కోరును లెక్కిస్తూ గణితాన్ని నేర్చుకుంటున్నారని ఇషికా గర్వంగా చెప్పారు.

హోమ్ స్కూలింగ్‌తో చదువే కాదు...సంగీతం, చిత్రలేఖనం, వంట చేయడం వంటి అనేక ఇతర పనులను కూడా పిల్లలు నేర్చుకుంటున్నారు. సిరిషా అనే మహిళ కుమార్తె జర్మన్ భాష వారు ఆంగ్లంలో మాట్లాడుతుంటే విని తాను అనర్గళంగా మాట్లాడుతుందని ఆమె తెలిపారు. బెంగాలీ, హిందీ, ఉర్దూ భాషలు కూడా వచ్చు. పరిసరాల ప్రభావం పిల్లలపై ఎక్కువగా పడుతుంటుంది. జీవితంలో ఎదురయ్యే అనుభవాలే పిల్లలకు పాఠాలు నేర్పుతాయి. తమ పిల్లలు పుస్తకాలకే పరిమితం కావడం తమకు ఇష్టం లేదని, వారి ఆసక్తిని తెలుసుకొని దానికి అనుగుణంగా విషయ పరిజ్ఞానం కలిగిస్తామని, హోమ్ స్కూలింగ్ ద్వారా పిల్లల మేధస్సు వికసిస్తుందని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

అయితే ఇందులో సవాళ్లు ఉన్నాయి. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో తల్లిదండ్రులకు అంత సమయమే ఉండదు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు కలవరపెడుతుంటాయి. ఈ పరిస్థితుల్లో పిల్లలకు తీరుబడిగా చదువు చెప్పే తీరిక ఎవరికి ఉంటుంది? పైగా హోమ్ స్కూలింగ్ కారణంగా ఇతర పాఠశాల పిల్లలతో సంబంధాలు ఉండవని, వారు ఒంటరివారు అవుతారని సంస్కృతి గ్రూప్ ట్రస్ట్ కార్యదర్శి ప్రతిభ శేఖర్ చెప్పారు. తోటి పిల్లలతో కలిసి మెలిసి ఉన్నప్పుడు, చదువుకున్నప్పుడు వారి బుద్ధి వికసిస్తుందని, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, ఇంటి వద్ద చదువుకుంటే అది సాధ్యపడదని ఆమె తెలిపారు.

బొలీవియాలో రోడ్డు ప్రమాదం

- 37 మంది మృతి

సుక్రే : దక్షిణాఫ్రికా దేశం బొలివియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 37 మంది మరణించారు. ఈ ఘటనలో మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంపై బొలివియా మీడియా, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉయుని సమీపంలో బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. లాటిన్ అమెరికాలో అతిపెద్ద ఉత్సావాల్లో ఒకటైన ప్రఖ్యాత ఒరురో కార్నివాల్‌కు బస్సులు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీశారు. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి వైద్య సాయం అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్లు ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. అయితే తీవ్రంగా గాయపడిన ఒక బస్సు డ్రైవర్‌కు ఐసియూలో చికిత్స పొందుతున్నారు.

ఆదాయపు పన్ను సక్రమంగా చెల్లించాలి

- ఆదాయ పన్ను శాఖ ఉమ్మడి రాష్ట్ర చీఫ్ ప్రిన్సిపల్ కమిషనర్ మిథాలి మధుస్మిత

కడపఅర్బన్ : తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయపన్ను చెల్లింపుదారులు తగ్గిపోయారని, దీంతో రాబడి తగ్గిపోయిందని ఆదాయపన్ను శాఖ ఉమ్మడి రాష్ట్ర చీఫ్ ప్రిన్సిపల్ కమిషనర్ మిథాలి మధుస్మిత అన్నారు. వ్యాపారులు ఆదాయ పన్ను సక్రమంగా చెల్లించాలని కోరారు. ఆదివారం ఆదాయపన్ను కార్యాలయంలో మధుస్మితతో పాటు చీఫ్ కమిషనర్ సురేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మధుస్మిత మాట్లాడారు.



సెంట్రల్ యూనివర్సిటీకి

కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి

- 'వర్శిటీ'లో ఫీజులను నియంత్రించాలి
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం (అనంతపురం జిల్లా)

రాష్ట్ర విభజన అనంతరం జిల్లాకు కేటాయించిన సెంట్రల్ యూనివర్శిటీకి ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో మెండిచేయి చూపడం బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ విమర్శించారు. ఆదివారం అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో సెంటర్ యూనివర్సిటీ 3వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన జరిగిన దాదాపు పదేళ్ల తర్వాత సెంట్రల్ యూనివర్సిటీ కొంత పూర్తిస్థాయిలో ప్రారంభించారన్నారు. అయితే ఇప్పటికీ యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో తరగతి గదులు, హాస్టల్ భవనాలు లేకపోగా అమ్మాయిలకు రక్షణ కరువైందన్నారు. అంతేగాకుండా దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై ఫీజులు భారం వేస్తున్నారన్నారు. అభివృద్ధికి చేయూతనందించాల్సిన కేంద్రం పూర్తిగా విస్మరించిందన్నారు. ఇందుకు ఇటీవల విడుదల చేసిన బడ్జెట్టే ఇందుకు నిదర్శమన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధి నిధుల సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం 21మందితో నూనత కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి మేరీ జార్జి, ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ రజిత, ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, సహాయ కార్యదర్శి భీమేష్, జిల్లా కమిటీ సభ్యులు సోము, సాయి, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ సీనియర్ నాయకులు జినీత్, వంశీ, తన్నై, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు ఫారెస్ట్ అధికారుల ఆటంకంపై..

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఫారెస్ట్ అధికారులు అనుమతులు ఇవ్వకుండా ఆటంకం పరచడాన్ని నిరసిస్తూ గిరిజన ప్రజలు నెత్తిపై అడ్డాకులు ధరించి టోపీలతో నమస్కారాలు పెడుతూ వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి కొండ శిఖర గ్రామాలైన చిన్నకోనల, భూరిగా, వనిజతో పాటు ఎన్ ఆర్ పురం పంచాయతీ పరిధి మరో ఐదు గ్రామాలకు ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉంటుంది. గిరిజనులు ఆదివారం చిన్న కోనల, వనిజ గ్రామాల వద్ద ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనారోగ్యాలకు గురైన రోగులకు, గర్భిణులను డోలీల సహాయంతో ఎత్తైన కొండపల్లి నడుమ 10 నుండి 15 కిలోమీటర్ల దూరం గ్రామాల్లో చేర్చవలసి ఉంటుందన్నారు. వార్డు మెంబర్ సోమేల. అప్పలరాజు, కొనపర్తి సింహాచలంలు మాట్లాడుతూ, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ స్పందించి సుమారు మూడు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టేందుకు అధికారులు, కాంట్రాక్టరు వచ్చారని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు అనుమతులు లేవని, రోడ్డు పనులు చేపట్టవద్దని అడ్డుపడ్డారన్నారు.

నెల రోజుల క్రితం పనులకు వెళ్లిన సార కొత్తయ్య కుమారుడు ఈశ్వరరావు మృతి చెందగా విజయనగరం జిల్లా వెంకట మండలం వనిజ వద్ద నుంచి మృతదేహాన్ని చిన్న కోనేల గ్రామానికి డోలి సహాయంతో ఎనిమిది కిలోమీటర్ల దూరం ఎత్తైన కొండల నడుమ నుండి తరలించామని గుర్తు చేశారు. రోగులు, గర్భిణులను మెంటాడ ఆస్పత్రికి తరలించాలన్నా ఇదే పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. పత్రికల్లో కథనాలను స్పందించిన కలెక్టర్ రోడ్డు మంజురు చేశారని, ఫారెస్ట్ అధికారులు ఆటంకం పరచడం సరికాదని అన్నారు. అనుమతులు ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'నిజాయితీ' ఫలితంగానే తాళాలు : ఆప్

భోపాల్ : నిజాయితీగా వ్యవహరిస్తున్నందునే మధ్యప్రదేశ్‌లోని ఆప్ కార్యాలయానికి తాళాలు పడ్డాయని ఆప్ ఆదివారం పేర్కొంది. భోపాల్‌లో లీజుకి తీసుకున్న నివాసం నుండి ఆప్ తన కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే గత మూడు నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో యజమాని కార్యాలయానికి తాళాలు వేశారు. నిజాయితీ ఫలితమే ఇదని ఆప్ మాజీ ఎంపి, జాయింట్ సెక్రటరీ రమాకాంత్ పటేల్ పేర్కొన్నారు. త్వరలోనే పరిస్థితి మెరుగుపడుతుందని, తాము నిజాయితీపరులమని, తమ పార్టీకి నిధులు లేవని, దీంతో అద్దె చెల్లించలేకపోయమాని అన్నారు. స్థానిక నిధులతో పార్టీ వ్యవహారాలు నిర్వహిస్తున్నామని, కార్యకర్తల ఆర్థిక పరిస్థితి సరిగా లేదని అన్నారు.

ఆప్ ఎంపి కార్యాలయం తాళం వేయబడింది. తర్వాత కాంగ్రెస్ వంతు అంటూ మధ్యప్రదేశ్ బిజెపి ప్రతినిధి నరేంద్ర సలూజా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమిపాలైంది. మొత్తం 70 సీట్లకు గాను బిజెపికి 48 సీట్లు రాగా, ఆప్ 22 సీట్లను గెలుచుకుంది.

అన్ని పదవుల నుంచి మేనల్లుడిని తొలగించిన మాయావతి

లక్నో : బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బిఎస్‌పి)లో అన్ని కీలక పదవుల నుంచి తన మేనల్లుడు అకాశ్ ఆనంద్‌ను ఆ పార్టీ అధినేత్రి మాయావతి ఆదివారం తొలగించారు. తాను ప్రాణాలతో ఉన్నంత వరకూ పార్టీలో తనకెవ్వరూ వారసులు ఉండరని ఆమె ఈ సందర్భంగా ప్రకటించారు. ఆదివారం లక్నోలో పార్టీ ఆఫీస్ బేరర్లతో కలిసి ఉన్నతస్థాయి సమావేశాన్ని మాయావతి నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకత్వంలో గణనీయమైన మార్పులు ప్రకటించారు. జాతీయస్థాయిలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించడానికి సమన్వయకర్తలుగా ఆమె సోదరుడు ఆనంద్ కుమార్, రాంజీ గౌతమ్ నియమితులయ్యారు. పార్టీ, ఉద్యమం తనకు ముఖ్యమైనవని, బంధాలు, బంధుత్వాలు వాటి తర్వాతేనని ఈ సందర్భంగా మాయావతి చెప్పారు. కాగా, గతేడాది మేలో కూడా అకాశ్ ఆనంద్‌ను పార్టీలో అన్ని పదవులు నుంచి మాయావతి తొలగించారు. మళ్లీ కొద్ది రోజులకే తన వారసుడిగా ప్రకటించి పదవులు కట్టబెట్టారు.

రైతులకు రూ.5కే విద్యుత్ కనెక్షన్

- మధ్యప్రదేశ్ సిఎం వెల్లడి

భోపాల్ : రైతులకు రూ.5కే శాశ్వత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రకటించారు. భోపాల్‌లో ఆదివారం నిర్వహించిన ఓ ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఈ పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తుందన్నారు. శాశ్వత విద్యుత్ కనెక్షన్ లేని రైతాంగానికి ఈ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. నీటిపారుదల కోసం సోలార్ పైపుల ద్వారా రైతులకు విద్యుత్ సంబంధిత ఇబ్బందుల్ని తమ ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. రాబోయే మూడేళ్లలో 30 లక్షల సోలార్ ఇరిగేషన్ పంపుల్ని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సిఎం చెప్పారు.

బిజెపి నేతలే కాంగ్రెస్ వైపు చూస్తున్నారు

- కర్ణాటక డిప్యూటీ సిఎం శివకుమార్

బెంగళూరు : బిజెపిలో తాను చేరబోతున్నట్లు వచ్చిన కథనాలను కర్ణాటక ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డికె శివకుమార్ తీవ్రంగా ఖండించారు. వాస్తవానికి బిజెపి నాయకులే కాంగ్రెస్‌లో చేరేందుకు తమను సంప్రదిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కోయంబత్తూరులోని ఈశా ఫౌండేషన్ అధినేత జగ్గీవాసుదేవ్ ఆశ్రమంలో జరిగిన కార్యక్రమానికి డికె శివకుమార్ హాజరయ్యారు. ఇదే కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా విచ్చేయడంతో ఆయనతో మర్యాదపూర్వంగా భేటీ అయినట్లు శివకుమార్ తెలిపారు. అయితే ఈ భేటీ నేపథ్యంలో శివకుమార్ బిజెపిలో చేరుతున్నారంటూ మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో అవన్నీ తప్పుడు కథనాలన్నీ తాను బిజెపిలో చేరే ప్రసక్తే లేదని శివకుమార్ స్పష్టం చేశారు. 'ముందు బిజెపి తన ఇంటిని చక్కదిద్దుకోనివ్వండి. ఆ పార్టీలోని పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయాన్ని మా పార్టీ మంత్రులే స్వయంగా వెల్లడించారు. దీనిపై ఎలాంటి చర్చలు అవసరం లేదు' అని శివకుమార్ పేర్కొన్నారు. ఈశా ఫౌండేషన్ కార్యక్రమం పూర్తిగా ఆధ్యాత్మికమైనదని, అందులో రాజకీయాలకు తావులేదని తెలిపారు. జగ్గీవాసుదేవ్ రాష్ట్రానికి చెందినవారని, ఆయన కావేరీ జలాల కోసం పోరాడుతున్నందునే తాను ఆ కార్యక్రమానికి వెళ్లానని శివకుమార్ తెలిపారు. జగ్గీవాసుదేవ్ స్వయంగా వచ్చి ఆహ్వానించడంతోనే తాను ఆ కార్యక్రమానికి వెళ్లాల్సివచ్చిందన్నారు.

ఉక్రెయిన్ దాడులతో రష్యాలో 652 మంది పౌరులు మృతి

మాస్కో : రష్యా సరిహద్దుల్లో ఉక్రెయిన్ దాడుల కారణంగా ఇప్పటి వరకూ 652 మంది సాధారణ పౌరులు మృతి చెందారు. ఈ విషయాన్ని రష్యా దర్యాప్తు కమిటీ చీఫ్ అలెగ్జాండర్ బాస్ట్రికన్

మీడియాకు వెల్లడించారు. మృతుల్లో 23 మంది చిన్నారులు ఉన్నారని, దాదాపు 3 వేల మంది గాయపడ్డారని తెలిపారు. ఉక్రెయిన్‌తో సంక్షోభం ప్రారంభమైన దగ్గర నుంచి కూడా ఆ దేశం తమ పౌరులను లక్ష్యంగా చేసుకుంటుందని బాస్ట్రికిన్ విమర్శించారు. అయితే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను పేర్కొనలేదు.

హిందీని బలవంతంగా రుద్దుతారా?

- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు
- కేంద్ర, రాష్ట్రాల మధ్య రగులుతున్న వివాదం

న్యూఢిల్లీ : జాతీయ విద్యా విధానం, దాని త్రిభాషా సూత్రంపై చాలా కాలం నుండే చర్చ నడుస్తున్నప్పటికీ తమిళనాడు ప్రభుత్వం, కేంద్రం మధ్య రగులుతున్న వివాదంతో అది ఇప్పుడు తారా స్థాయికి చేరుకుంది. అసలు భాషా వివాదం ఈ నాటికి కాదు. 1960వ దశకంలోనే దాని మూలాలు ఉన్నాయి. హిందీని నిర్బంధ భాషగా రుద్దడాన్ని తమిళనాడు అప్పుడే వ్యతిరేకించింది. ఈ విధానం వివిధ భాషలను ప్రోత్సహిస్తుందని కేంద్రం అంటుంటే హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తుందని తమిళనాడు వాదిస్తోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రాన్ని, దానిపై వచ్చిన ఆరోపణలను 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక విశ్లేషించింది.



కొఠారీ కమిషనన్ ఏం చెప్పింది?

త్రిభాషా సూత్రాన్ని తొలుత విద్యా కమిషన్ (1964-66) ప్రతిపాదించింది. దీనినే అధికారికంగా కొఠారీ కమిషన్ అంటారు.

ఈ కమిషన్ అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నేతృత్వంలో విద్యకు సంబంధించిన జాతీయ విధానం (ఎన్‌పీఈ)-1968లో త్రిభాషా సూత్రాన్ని ఆమోదించింది. అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ నేతృత్వంలో ఎన్‌పీఈ-1986లో ఈ సూత్రాన్ని పునరుద్ఘాటించారు. భాషా పరమైన వైవిధ్యాన్ని, దేశ ఐక్యతను పెంపొందించడానికి పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1992లో దానిని సవరించింది. భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ దౌలత్ సింగ్ కొఠారీ నేతృత్వంలోని కమిషన్ మూడు భాషలు నేర్చుకోవాలని సిఫార్సు చేసింది. అవి....మాతృ భాష లేదా ప్రాంతీయ భాష, కేంద్ర ప్రభుత్వ అధికారిక భాష, ఈ రెండూ కాకుండా ఆధునిక భారతీయ లేదా యూరోపియన్ భాష.

జాతీయ విద్యా విధానం ఏం చెబుతోంది?

హిందీని, హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో ఆంగ్లాన్ని...వాటితో పాటు ఒక ఆధునిక భారతీయ భాషను (దక్షిణాది భాషల్లో ఒకటి) అభ్యసించాలని ఎన్‌పీఈ-1968 నిర్దేశించింది. హిందీ యేతర భాషలు మాట్లాడే రాష్ట్రాల్లో హిందీని, ఆంగ్లాన్ని, ప్రాంతీయ భాషను అభ్యసించాలని సూచించింది. ఎన్‌పీఈ-1986, 1992 ఈ విధానాన్నే కొనసాగించాయి. అయితే హిందీ వినియోగంపై రాష్ట్రాల మధ్య సాధారణ ఏకాభిప్రాయం అవసరమని తెలిపాయి. ప్రజలు హిందీని వాడడంలో నైపుణ్యాన్ని సాధించడానికి త్రిభాషా సూత్రాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరముందని కూడా ఆ విధానాలు నొక్కి చెప్పాయి. 1968వ సంవత్సరపు విధానం కింద త్రిభాషా సూత్రాన్ని సరిగా అమలు చేయడం లేదని ఎన్‌పీఈ-1992 అభిప్రాయపడింది. దానిని మరింత ఉత్సాహంగా, ఉపయుక్తంగా అమలు చేయాలని సూచించింది.

ఎన్‌పీఈ-2020 ఏమంది?

వాస్తవానికి ఎన్‌పీఈ-2020 హిందీని రుద్దలేదు. ఏ భాషను బలవంతంగా రుద్దడానికి అది సుముఖత చూపలేదు. రాజ్యాంగ నిబంధనలను దృష్టిలో పెట్టుకొని వివిధ భాషలను అభివృద్ధి చేయడానికి, దేశ ఐక్యతను చాటిచెప్పడానికి త్రిభాషా సూత్రం అమలును కొనసాగించాల్సిన అవసరం ఉన్నదని తెలిపింది. పిల్లలు మూడు భాషలు నేర్చుకోవాలా వద్దా అనేది రాష్ట్రాలు, ప్రాంతాలు, విద్యార్థుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని చెప్పింది. తద్వారా రాష్ట్రాలకు నిర్ణయాధికారం ఉన్నదని స్పష్టం చేసింది. స్థానిక భాషలో విద్యా బోధన జరపడం వల్ల అవగాహన పెరుగుతుందని, సంస్కృతి పరిరక్షించబడుతుందని, విద్యార్థుల పనితీరు మెరుగుపడుతుందని అభిప్రాయపడింది. కాగా నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్-2000, 2005, 2023 కూడా త్రిభాషా సూత్రాన్ని సమర్థించాయి.

తమిళనాడు వ్యతిరేకత


తమిళనాడు విషయానికి వస్తే త్రిభాషా సూత్రాన్ని అది చారిత్రకంగా వ్యతిరేకిస్తూ వస్తోంది. 1937లో సి.రాజగోపాలాచారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లో నిర్బంధ హిందీని ప్రవేశపెట్టినప్పుడు జస్టిస్ పార్టీ, పెరియార్ వంటి ద్రవిడ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. 1940లో ఆ విధానాన్ని రద్దు చేసినప్పటికీ స్వాతంత్ర్యానంతరం హిందీ వ్యతిరేక మనోభావాలు ప్రబలడం ప్రారంభమయ్యాయి. 1968లో త్రిభాషా సూత్రాన్ని ప్రవేశపెట్టినప్పుడు తమిళనాడు దానిని తిరస్కరించింది. ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై నేతృత్వంలో ఆ రాష్ట్రం ద్విభాషా (తమిళం, ఆంగ్లం) సూత్రాన్ని ఆమోదించింది. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయని ఏకైక రాష్ట్రం తమిళనాడే. తాజాగా...ఎన్ఈపీలోని ముఖ్యమైన అంశాలను అమలు చేయనందుకు సమగ్ర శిక్షా అభియాన్ కింద తమిళనాడుకు రూ.573 కోట్ల సాయాన్ని కేంద్రం నిలిపివేసింది. దీంతో కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదం తీవ్ర రూపు దాల్చింది.

ఉత్తరాఖండ్ హిమపాతం ఘటనలో మిగిలిన నలుగురూ మృతి

- ముగిసిన సహాయక కార్యక్రమాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక హిమపాత ఘటనలో గల్లంతైనట్లు భావించిన ఐదుగురిలో ఒకరు క్షేమంగా ఇంటికి చేరుకోగా మిగిలిన నలుగురూ మృతి చెందారు. నిర్విరామంగా సహాయక చర్యలు చేపట్టిన జవాన్లు, ఇరత సహాయక బలగాలు ఆదివారం మధ్యాహ్నం చివరి మృతదేహన్ని కూడా గుర్తించారు. దీంతో సహాయక కార్యక్రమాలను అధికారులు నిలిపివేశారు. రాష్ట్రంలోని చమోలి జిల్లాలో మనా గ్రామం సమీపంలో శుక్రవారం సంభవించిన ఆకస్మిక హిమపాతంలో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్ఒ) శిబిరం కూరుకుపోయిన సంగతి తెలిసిందే. ఈ శిబిరంలో 55 మంది ఉన్నారని అధికారులు ముందుగా భావించారు. అయితే ఇందులో ఒక కార్మికుడు ఎవరికి చెప్పకుండా అనధికార సెలవులో సురక్షితంగా సొంత ఊరికి చేరుకున్నట్లు అధికారులకు తెలిసింది. దీంతో 54 మంది కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగించారు. శనివారం ఉదయానికే 50 మందిని రక్షించి జోషిమఠ్‌లోని సైనిక ఆసుపత్రికి తరలించారు. అయితే వీరిలో నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆదివారం ఉదయం మంచులో నలుగురి మృతదేహాలను గుర్తించారు. కాగా చికిత్స పొందుతున్న 46 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

హర్యానాలో కాంగ్రెస్ మహిళా కార్యకర్త హత్య



చండీగఢ్: హర్యానాలో కాంగ్రెస్ మహిళా కార్యకర్త హిమానీ నార్వాల్ దారుణ హత్యకు గురయ్యారు. శనివారం రాత్రి సమయంలో ఆమె మతదేహాన్ని సూట్ కేసులో కనుగొనడంతో హిమానీ హత్య విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసును అనుమానాస్పద మతిగా నమోదు చేసుకున్న పోలీసులు.. విచారణ ఆరంభించారు. అయితే దీనిపై సమగ్ర కోణంలో విచారణ జరిపించాలనేది కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇందుకోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎంఎల్‌ఏ భరత్ భూషణ్ బత్రా.. పోలీసులకు విజ్ఞప్తి చేశారు. పోలీసుల కథనం ప్రకారం..హర్యానాలోని రోహతక్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ దారణం శనివారం వెలుగులోకి వచ్చింది. హిమానీని హత్య చేసిన అనంతరం సూట్ కేసులో మూటగట్టి ఓ నిర్మానుష ప్రాంతంలో పడేశారు దుండగులు. ఆమె మృతదేహం సూట్ కేసులో లభించింది. సప్లా బస్టాండ్ దగ్గర సూట్ కేసులో హిమానీ నార్వాల్ మతదేహం ఉండటంతో స్థానికంగా కలకలం రేగింది. ఆ బస్టాండ్ వద్ద సూట్ కేసు పడి ఉండటంతో తెరిచి చూడటంతో ఈ దారుణం వెలుగు చూసింది. గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రలో ఆమె చురుగ్గా పాల్గొన్నారు. ఆమె మెడపై గాయాలుండటం కూడా ఇదే హత్యేనని అనడానికి మరింత బలంగా చేకూర్చుతోంది.



'డోజ్'పై అమెరికన్ల ఆగ్రహం

టెస్లా కార్యాలయాల ఎదుట నిరసనల హోరు

వాషింగ్టన్ : అమెరికాలో ప్రభుత్వ సమర్థత పేరిట సంక్షేమ పథకాలను కుదిస్తూ నిధుల కోత విధిస్తుండటంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ మిత్రుడు, టెస్లా గ్రూపు సంస్థల అధినేత ఎలాన్ మస్క్ నేతృత్వంలో ప్రభుత్వ వ్యయాలను తగ్గించేందుకు ప్రత్యేకంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిసియన్సీ (డోజ్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్, ఎలాన్ మస్క్ తీరును, డోజ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అమెరికాలోని టెస్లా కార్యాలయాల ఎదుట ఆందోళనకారులు ఆదివారం భారీ నిరసన చేపట్టారు. ఉత్తరఅమెరికా, ఐరోపాలో ట్రంప్ విధ్వంసకర పాత్రకు పెరుగుతున్న వ్యతిరేకతకు ఈ ప్రదర్శనలు నిదర్శనం. దీనిలో భాగంగా టెస్లా కొనుగోళ్లను అడ్డుకోవాలని, ఆటంకం కలిగించాలని ఆందోళనకారులు భావిస్తున్నారు. ఇంగ్లండ్, స్పెయిన్ మరియు పోర్చుగల్‌తో పాటు యునైటెడ్ స్టేట్స్‌లోని పలు ప్రాంతాల్లో మరిన్ని నిరసనలు చేపట్టనున్నట్లు ఆందోళనకారులు పేర్కొన్నారు. టెక్సాస్, అరిజోనా సహా సెయింట్ లూయిస్, న్యూయార్క్ నగరం, డేటన్, ఒహియోబీ షార్లెట్, మరియు పాలో ఆల్టో, కాలిఫోర్నియాల్లో కూడా ఇటీవల భారీ ప్రదర్శనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఎలాన్ మస్క్, ట్రంప్ విధానాలను నిరసిస్తూ కొంతమంది టెస్లా కార్ల యజమానులు తమ వాహనాలను ధ్వంసం చేసినట్లు స్థానిక మీడియా తమ కథనాల్లో పేర్కొంది. ఇటీవల ట్రంప్, మస్క్ వేల సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగుల తొలగించడంతో పాటు ఒప్పందాలను రద్దు చేశారు.

యుఎస్‌ఏజన్సీఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్‌తో సహా ప్రభుత్వ విభాగాలను మూసివేశారు. మస్క్ చర్యలు అమెరికా బడ్జెట్‌ను నియంత్రించడానికి, తన సంపదను పటిష్టపరుచుకోవడానికి అనేకమార్గాలను అందించి, కాంగ్రెస్‌ను ధిక్కరిస్తున్నాయని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

అమెరికా అధికారిక భాషగా ఇంగ్లీష్

- ఉత్తర్వులపై ట్రంప్ సంతకం

వాషింగ్టన్: అమెరికా అధికారిక భాషగా ఇంగ్లీష్‌ను పేర్కొంటూ, ఇందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఆదేశాలపై నూతన అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. తాజా ఆదేశాలు ఫెడరల్ ప్రభుత్వ నిధులతో నడిచే ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు తమ సేవలను, పత్రాలను ఇంగ్లీషేతర భాషల్లో కొనసాగించాలా, వద్దా? అని ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. 'ఇంగ్లీష్ అధికారిక భాషగా ఏర్పాటు చేయడం వల్ల సంభాషణలు క్రమబద్ధీకరించడమే కాకుండా ఉమ్మడి జాతీయ ప్రయోజనాలు బలోపేతం అవుతాయి. సమ్మిళిత, సమర్థవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ చర్య దేశంలో ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రభుత్వ కార్యక్రమాల్లో సమర్థతను నెలకొల్పుతుందని తెలిపారు. ఇంగ్లీష్‌ను అధికారిక భాషగా గుర్తిస్తూ ఇప్పటికే అమెరికాలోని 30 రాష్ట్రాలు చట్టం చేశాయి. అయితే, అమెరికా అధికార భాషగా ఇంగ్లీష్ గుర్తింపు కోసం కాంగ్రెస్ చట్టసభ సభ్యులు దశాబ్దాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ అవి సఫలం కాలేదు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే వైట్‌హౌస్ వెబ్‌సైట్ స్పానిష్ వెర్షన్‌ను తొలగించారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడయ్యాక ఇదే విధంగా చేసినప్పటికీ.. బైడెన్ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించడం గమనార్హం.

ద్రవ్యోల్బణం.. కరెన్సీ పతనం

ఇరాన్ ఆర్థిక మంత్రిపై అభిశంసన వేటు



టెహ్రాన్ : ఇరాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. ఒకవైపు ద్రవ్యోల్బణం ఆకాశమే హద్దుగా అంతకంతకూ ఎగబాకుతుంటే మరోవైపు అంతర్జాతీయ మారకాలతో పోల్చితే ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ పాతాళానికి పరుగులు గీస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక మంత్రి అబ్దొల్‌నాజెర్ హేమ్మతి అభిశంసనకు గురయ్యారు. పార్లమెంటులో ఈ మేరకు ఆదివారం ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా 273 మంది సభ్యుల్లో 182 మంది ఓటేసినట్లు స్పీకర్ ఖాలిబఫ్ ప్రకటించారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం..పార్లమెంటులో తీర్మానం ఆమోదం పొందిన వెనువెంటనే మంత్రి తొలగింపు అమల్లోకి వస్తుంది. ఇరాన్‌లో మసూద్ పెజెష్కియాన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఓటింగ్ ప్రక్రియ సందర్భంగా దేశాధ్యక్షుడు పెజెష్కియాన్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ప్రస్తుతం పశ్చిమ దేశాలతో పోరాటంలో చిక్కుకుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ కఠినమైన పరిస్థితులు ఎదుర్కొంటోందని ఆర్థికశాఖ మంత్రి హెమ్మతి తెలిపారు. ద్రవ్యోల్బణం 35 శాతంగా ఉందని అంగీకరించిన ఆయన.. ఈ సమస్యను పరిష్కరించేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. అయితే, దీనికి సమయం పడుతుందని చెప్పారు.

అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ రెండో సారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇరాన్ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. కరెన్సీ కుప్పకూలిపోవడంపై స్థానికంగా తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. ఆర్థిక నిర్వహణలో లోపాలు ఉన్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. అణ్వస్త్ర కార్యక్రమాల కారణంగా అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లుగా పతనావస్థలో ఉంది. 2015లో అగ్రరాజ్యంతో అణు ఒప్పందం చేసుకునే నాటికి ఒక డాలర్‌కు 32 వేల రియాల్స్ ఉండేవి. కొంతకాలంగా భారీగా క్షీణిస్తూ వస్తున్న కరెన్సీ విలువ.. గతేడాది జులైలో పెజెష్కియాన్ అధికారం చేపట్టే సమయానికి 5.84 లక్షల రియాల్స్‌కు పడిపోయింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల నాటికి 7.03 లక్షలకు చేరుకుంది. ఇటీవల అది మరింత పతనమై దాదాపు 9.30 లక్షల రియాల్స్‌కు పడిపోయింది.

ఇళయరాజాను సత్కరించిన తమిళనాడు సిఎం స్టాలిన్



చెన్నై: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సత్కరించారు. ఇళయరాజా ఈ నెల 8న లండన్‌లో 'సింఫనీ' వేదికగా భారీ స్థాయిలో ఆర్కెస్ట్రా ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్టాలిన్ స్వయంగా ఇళయరాజా నివాసానికి వెళ్లి అభినందించారు. ఇళయరాజాను శాలువాతో సన్మానించి కాసేపు ముచ్చటించారు. ఈ వీడియోను స్టాలిన్ తన సోషల్‌మీడియా ఖాతా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇళయ రాజా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజల సంగీత శ్వాస అని స్టాలిన్ కొనియాడారు. ఆసియాలోనే ఇంతకుముందు ఎవరూ చేపట్టని రీతిలో సింఫనీ కార్యక్రమం ఏర్పాటుకు ధైర్యంగా ముందుకు వచ్చిన ఇళయరాజాను అభినందించారు. అదే సమయంలో తన చేతితో రాసిన మ్యూజిక్ నోట్స్‌ని ఇళయరాజా సిఎంకు చూపించారు. స్టాలిన్ పోస్టును రీట్వీట్ చేస్తూ ఆయనకు ఇళయరాజా ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు.

కుంభమేళాకు మోహన్‌భగవత్ వెళ్లారా?

- ఆర్ఎస్ఎస్ చీఫ్‌ని అడిగే ధైర్యం ఉందా
- ఏక్‌నాథ్ షిండేని నిలదీసిన సంజయ్ రౌత్

ముంబయి : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాపై శివసేన, శివసేన (యుబిటి) మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. హిందువుల ప్రతినిధులమని చెప్పుకునే ఆర్ఎస్ఎస్ నేతలు అస్సలు హిందూ సాంప్రదాయాలే పాటించరని శివసేన (యుబిటి) నేత, రాజ్యసభ సభ్యులు సంజయ్ రౌత్ విమర్శించారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ మహాకుంభ్‌లో స్నానమాచరించినట్లు చిత్రాలేవీ బయటకు రాలేదని, అంటే ఆయన ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారా? లేదా? అని సంజయ్ సందేహం వ్యక్తం చేశారు. ఇదే ప్రశ్న అడిగే ధైర్యం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, శివసేన నేత ఏక్‌నాథ్ షిండేకు ఉందా? అని ఆయన నిలదీశారు. కొందరు హిందువలమని చెప్పుకుంటారని, కానీ కుంభమేళాకు మాత్రం వెళ్లరంటూ శివసేన (యుబిటి) నేతలనుద్దేశించి ఏక్‌నాథ్ షిండే ఇటీవల చేసిన వ్యాఖ్యలకు సంజయ్ ఆదివారం కౌంటరిచ్చారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ని ఇలాగే ప్రశ్నించే ధైర్యం షిండేకు ఉందా? ఆయన హిందువు కాదా? అని ప్రశ్నించారు. హిందూ ధర్మ పరిరక్షణ గురించి మాట్లాడే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కుంభమేళాలో స్నానం చేసిన ఫోటోలు ఇప్పటి వరకు తాను చూడలేదన్నారు. ఆర్ఎస్ఎస్ ముఖ్యనేతలు కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, గోల్వాల్కర్, బాలాసాహెబ్ దేవరాస్, రజ్జుభయ్యా, కెఎస్ సుదర్శన్ కూడా సంగమంలో స్నానాలు చేస్తున్న ఫోటోలు తాము చూడలేదని సంజయ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కుంభమేళాలో స్నానం చేస్తున్న ఫోటోలను ఇప్పుడు హల్‌చల్ చేస్తున్నాయి కానీ..గతంలో ప్రధాని కాకముందు మోడీ కుంభమేళాను సందర్శించిన ఫోటోలు తాను చూడలేదని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. తమ పార్టీ నకిలీ హిందూత్వ, పబ్లిసిటీ స్టంట్‌లను నమ్మదని అన్నారు.

ట్రంప్ రాక..అదానీ పెట్టుబడులకు బాట



న్యూఢిల్లీ : కొన్ని నెలల క్రితం హిండెన్‌బర్గ్ సంచలన నివేదికతో అదానీ గ్రూపు నేల చూపులు చూసింది. ప్రపంచ మార్కెట్‌లో అదానీ సామ్రాజ్యం వేల కోట్ల రూపాయల నష్టాన్ని ఎదుర్కొన్నది. అమెరికా న్యాయశాఖ నోటీసులు, తనపై నమోదైన క్రిమినల్ అభియోగాలతో షేర్‌విలువ దారుణంగా పడిపోయింది. అమెరికాతో సహా పలు దేశాలలో పెట్టుబడులపై దీని ప్రభావం తీవ్రంగా పడింది. భారత్‌లో మోడీ ప్రభుత్వం ఉన్నా కూడా ఏమీ చేయలేని పరిస్థితి అదానీకి ఏర్పడింది. ఇప్పుడు అమెరికాలో ట్రంప్ రాకతో అక్కడ భారీ పెట్టుబడులు పెట్టేందుకు అదానీ గ్రూపునకు మార్గం సుగమమైంది.

భారత ప్రధాని మోడీని స్నేహితుడిగా భావించే డోనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన రాక యూఎస్‌లో అదానీ గ్రూపు పెట్టుబడులకు తిరిగి మార్గం సుగమం అవుతోంది. ఇటీవల విదేశీ అవినీతి పద్ధతుల చట్టం(ఎఫ్‌సీపీఏ) అమలుకు ట్రంప్ బ్రేకులు వేశారు. దీనిపై గత నెలలోనే నిర్ణయం తీసుకున్నారు. దీంతో అదానీ గ్రూపులో భారీగా ఆశలు చిగురించాయని విశ్లేషకులు అంటున్నారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం తర్వాత అదానీ గ్రూపు యూఎస్‌లో మౌలికసదుపాయాల కోసం భారీగా పెట్టుబడులు పెట్టే ప్రణాళికలకు అవకాశాలున్నాయని పలు నివేదికలు వివరిస్తున్నాయి.

ముడుపుల వ్యవహారంలో అదానీ, ఉన్నతాధికారులు కొందరు ప్రస్తుతం క్రిమినల్ అభియోగాలను ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ.. యూఎస్‌లోని పలు రంగాలలో ప్రాజెక్టుల కోసం పెట్టుబడులు పెట్టేందుకు అదానీ గ్రూపుమళ్లీ పరిశీలనను జరుపుతున్నదని తెలుస్తోంది. ఇందులో న్యూక్లియర్‌పవర్ అండ్ యుటిలిటీస్, ఈస్ట్ కోస్ట్ పోర్ట్ వంటి ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టే అవకాశమున్నదని సమాచారం. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన తర్వాత.. యూఎస్‌లో 15వేల ఉద్యోగాలను సృష్టించే 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు గౌతమ్ అదానీ హామీ ఇచ్చారు. అయితే, ఆ తర్వాత యూఎస్ యంత్రాంగాలు అదానీతో పాటు మరో ఏడుగురిపై తీసుకున్న చర్యల తర్వాత ఈ ప్రణాళికలు కార్యరూపం దాల్చలేకపోయాయి.

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. కొన్ని మార్పులను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా అవినీతి పద్ధతుల చట్టం(ఎఫ్‌సీపీఏ)ను గతనెలలో నిలిపివేశారు. అయితే, ఇది అదానీ గ్రూపునకు కలిగిన పెద్ద ఉపశమనమని మార్కెట్ నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. అదానీ గ్రూపునకు చెందిన కొన్ని విశ్వసనీయ వర్గాలు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నాయి. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంతో అదానీతో పాటు ఇతరులపై ఉన్న కేసులు కొట్టుడుపోతాయని భావిస్తున్నాయి. ట్రంప్ వచ్చాక మేము కొన్ని ప్రణాళికలను రీయాక్టివేట్ చేశామని అదానీకి చెందిన కొన్ని వర్గాలు చెప్తున్నాయి. అయితే, దర్యాప్తు నిరవధిక స్వభావం మాత్రం ఇప్పటికీ ఆందోళనను కలిగిస్తుందని వివరించాయి. పెట్టుబడులు పెట్టాలని మాకు ఉన్నా.. కేసుల పరిష్కారమయ్యేంత వరకు మేము ఎదురు చూస్తామని అదానీ గ్రూపునకు చెందిన కొన్ని వర్గాలు తెలిపినట్టు నివేదికలు పేర్కొంటున్నాయి.

గౌతమ్ అదానీ యూఎస్ కష్టాలు

అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, ఇతర ఉన్నతాధికారులకు అమెరికా న్యాయ శాఖ లంచం కేసులో నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. 250 మిలియన్ డాలర్ల(సుమారు రూ. 2000 కోట్లు) లంచం ఇచ్చి భారత ప్రభుత్వ అధికారుల నుంచి సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, అదానీ గ్రూపు ఈ ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నది.

గాజాస్ట్రిప్‌కు సాయాన్ని అడ్డుకుంటాం

- ఇజ్రాయిల్

టెల్ అవీవ్ : ఇజ్రాయిల్ తన అమానవీయ చర్యలను నిస్సిగ్గుగా కొనసాగిస్తూవుంది. గాజాస్ట్రిప్‌లోకి అన్ని రకాల సాయాన్ని, వస్తువుల ప్రవేశాన్ని అడ్డుకుంటామని ఇజ్రాయిల్ ఆదివారం ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు ప్రతిపాదనలను హమాస్ అంగీకరించకపోతే అదనపు పరిణామాలు ఉంటాయని నెతన్యాహూ సర్కార్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. రంజాన్ మరియు పాస్ ఓవర్ లేదా ఏప్రిల్ 20 వరకు కాల్పుల విరమణ మొదటి దశను పొడిగించే ప్రతిపాదనకు మద్దతు ఇస్తున్నట్లు ఇజ్రాయిల్ ఆదివారం తొలుత ప్రకటించింది. అమెరికా పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ నుండి ఈ ప్రతిపాదన వచ్చినట్లు ఇజ్రాయిల్ తెలిపింది. ఇజ్రాయిల్-హమాస్ కాల్పుల విరమణ మొదటి దశలో.. మానవతా సాయం కొనసాగింది. అయితే ఈ ఒప్పందం శనివారంతో ముగిసింది. కాల్పుల విరమణ రెండవ దశపై చర్చలు జరగాల్సి వుంది. రెండవదశలో ఇజ్రాయిల్ సైన్యం ఉపసంహరణ, శాశ్వత కాల్పుల విరమణకు బదులుగా హమాస్ మిగిలిన బందీలను విడిచిపెట్టాల్సి వుంది. ఈ ఒప్పందం ప్రకారం..హమాస్ మొదటి రోజు సంగ బందీలను విడుదల చేయాల్సి వుందని, శాశ్వతకాల్పుల విరమణపై ఒప్పందం కుదిరిన తర్వాత మిగిలిన వారిని విడుదల చేయాల్సి వుందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ కార్యాలయం తెలిపింది. ఇజ్రాయిల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ కోసం ఏడాది నుండి మధ్యవర్తిత్వం వహిస్తున్న ఈజిప్టు, ఖతార్, అమెరికాలు ఈ ఒప్పందంపై వ్యాఖ్యానించాల్సి వుంది. హమాస్ కూడా ఈ ప్రతిపాదనపై ఇప్పటికీ స్పందించలేదు.




మీ కోసం

సగ్గుబియ్యం వడియాలు పెట్టుకునేటప్పుడు ఉడికిన సగ్గుబియ్యంలో కొంచెం మజ్జిగ కలిపితే వడియాలు తెల్లగా వస్తాయి.

జీవన సౌరభం

అనుభవం నేర్పిన పాఠాలకు విలువ ఎక్కువ. ఆచరిస్తూ చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ. ఇష్టంతో చేసే పనులకు విజయాలు ఎక్కువ.

పండ్లు - రుచులు



పచ్చపచ్చని జామ పండు
చూస్తేనే నోరూరుచునుండు
ఉప్పు కారం చల్లుకుతింటే
ఉవ్విళ్ళూరిస్తూనే ఉండు

నల్లని ద్రాక్ష పండు ఇది
నిగ నిగలాడును ఇది
పుల్లని తీయని రుచులను యిచ్చి
నోరూరిస్తూ ఉంటుంది

సీతాఫలమెంతో తీయనైనది
మంచి పోషకాలను అందిస్తుంది
పసందైన తీయదనంతో
మైమరపిస్తూ ఉంటుంది

తీయని దానిమ్మ పండు
ఎర్రని గింజలు వుండు
చూస్తే నోరూరు చుండు
తింటే ఎంతో తృప్తిగనుండు

తియ్యనైన అరటిపండు
తింటే ఎంతో కమ్మగా నుండు
అన్ని కాలాల్లో దొరికే పండు
అద్భుతమైనది అరటి పండు

మామిడిపండు ఎంతో మధురం
చూడచక్కని సుందర రూపం
మామిడి రసం మహాద్భుతం
మరిచిపోలేని దివ్య ఫలం

నారింజ పండు నోరూరించు
పిన్న పెద్దలను ఆకర్షించు
గుజ్జును తింటే తృప్తినిచ్చును
రసం తాగితే తనివి తీరును

పచ్చా పచ్చని బత్తాయి
రసం తీసి తాగాలోయ్
రుచి ఎంతో అదురునోయి
ఆరోగ్యానికి మంచిదోయి

సపోటా పండు తీయనిది
అమృతంలా అనిపిస్తుంది
సపోటా రసం ఎంతో బలం
సంతృప్తినిచ్చే మంచి ఫలం

అందమైనదీ ఆపిల్ పండు
మెత్త మెత్తని గుజ్జుతో వుండు
పిల్లలకెంతో ఇష్టమీపండు
పుష్టికరమైన ఆపిల్ పండు

పచ్చని పండు పుచ్చ పండు
ముక్కలు చూస్తే నోరూరుచుండు
ఉప్పు / చక్కెర చల్లుకు తింటే
మనసుకు ఎంతో హాయిగనుండు

బొప్పాయి శక్తి ఎంతో మెండు
విటమిన్లనిచ్చి కాపాడుచుండు
అందరికీ అందుబాటులోనుండు
ఔషధ గుణములు దీనిలోమెండు

అనాస పండు అందమైన పండు
చక్కని రూపుతో ఆకట్టుచుండు
అనాస రసం ఎంతో మధురం
ఖనిజ లవణాల సమాహారం

ఫలములలో మిన్న పనసపండు
తొనలతో ఎంతో ఆకట్టుచుండు
పప్పు కూరలు పచ్చడి రసాల్లో
అన్నిట తానై అలరించుచుండు

అల్లనేరేడు అందం చూడు
రంగుతోనే అది నిగనిగలాడు
తియ్యని రుచితో ఆకర్షించు
మండు వేసవిలో నోరూరించు

ఖర్బూజ పండు కమ్మనైనది
పండ్లన్నింటిలో శ్రేష్ఠమైనది
గుజ్జు రసాలతో కాపాడునది
పోషకాలలో ప్రముఖమైనది

మేడిపండు మనకెంతో మేలైనది
శరీరానికిది ఎంతో చలువనిస్తుంది
చక్కెర వేసుకుతింటే తనివి తీరనిది
పురుగులుండి మనకిది
దూరమైనది

ఖర్జూర పండెంతో ఘనమైనది
మెత్తని గుజ్జుతో మృదువైనది
పుష్టినివ్వడంలో సాటిలేనిది
పోషకాలకిది ప్రకృతి నిధి

డ్రాగన్ పండు కమ్మగ నుండు
కివీ పండులో పోషకాలు మెండు
స్ట్రాబెర్రి ఎంతో రుచిగా నుండు
బ్లూ బెర్రీ పండ్లలో విటమినులుండు

ప్రకృతి ఇచ్చిన వరాలు పండ్లు
పండ్లేవైనా తినాలి ముందు
పండ్లన్నీ ఆరోగ్య ప్రదాతలు
పోషకాలిచ్చు సంరక్షకులు

పండు ఏదైనా ఫలమేదైనా
ఆరోగ్యానికి అవసరమన్నా
అన్ని పండ్లను ఆస్వాదిద్దాం
ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

– నాగరాజు కామర్సు,
తెలుగు ఉపాధ్యాయుడు,
92480 93580.

నేను గీసిన బొమ్మ





- డి.తేజశ్రీ, 6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతారెడ్డిపేట, సిద్ధిపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వినండి ... ఓ చిన్న మాట!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో వినికిడి లోపం కూడా ఒకటి. మనదేశంలో 6.30 కోట్ల మంది ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. రాబోయేకాలంలో యువత ఎక్కువగా సమస్య బారినపడే ప్రమాదం ఉంది. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లపై పనిచేస్తూ గంటల తరబడి హెడ్‌సెట్లు, హెడ్‌ఫోన్లు, ఇయర్‌బడ్స్, వైర్‌లెస్ బ్లూటూత్‌లు వంటివి వాడుతున్నారు. రోజుకు గంటకు మించి వాడకూడదు. కానీ రోజుకు 10 నుంచి 15 గంటల వరకూ వాడుతున్న వారూ ఉన్నారు. ఈ అలవాటు భవిష్యత్తులో తీవ్ర ప్రభావం చూపించొచ్చు.

వినికిడి సమస్య తలెత్తితే మాటలు స్వల్పంగా వినిపిస్తాయి. సరిగా అర్థం కావు. ఒక చెవి పాక్షిక వినికిడి నష్టం (సెన్సోరీ న్యూరల్ డెఫ్‌నెస్)తో మొదలై క్రమంగా తీవ్రరూపం దాల్చుతుంది. కొందరికి ఒక చెవిలో ఎక్కువ, మరో చెవిలో తక్కువగా సమస్య ఉండి ఉండొచ్చు. నిపుణులైన ఆడియాలజిస్టుతో వినికిడి పరీక్ష (ప్యూర్‌టోన్ ఆడియోమెట్రీ) చేయించుకుంటే ఎలాంటి రకం వినికిడి లోపమో, అదెంత శాతమో స్పష్టంగా తెలుస్తుంది. ఏ స్థాయి (ఫ్రీక్వెన్సీ) మాటలు వినిపించటం లేదో కూడా బయటపడుతుంది. తీవ్రతను బట్టి చికిత్సలు ఉంటాయి. వినికిడి లోపం 30–40 డెసిబెల్స్ ఉంటే సమస్య స్వల్పంగా, 50–60 ఉంటే మధ్యస్తంగా, 70–80 మధ్య ఉంటే తీవ్రంగా... 90 డెసిబెల్స్ కన్నా ఎక్కువ ఉంటే అత్యంత తీవ్రంగా ఉన్నట్లుగా గుర్తించొచ్చు. వినికిడిలోపం 30 డిసిబెల్స్ కన్నా ఎక్కువ గలవారికి వినికిడి సాధనం అవసరం అవుతుంది.

దీనిని సరిగ్గా ప్రోగ్రామింగ్ చేయటం కూడా ముఖ్యమే. ఏ ఫ్రీక్వెన్సీలో ఎంత వినికిడి తక్కువుందో గుర్తించి పరికరంలో దాన్ని అంతవరకూ పెంచాల్సివుంది. అప్పుడే మాటలు సరిగా వినిపిస్తాయి. నైపుణ్యం గల ఆడియాలజిస్ట్‌తో పరీక్షించి దానిని ఏర్పాటు చేయించుకోవాలి. వినికిడి యంత్రాన్ని చెవి మార్గంలో సరిగ్గా అమర్చటం కూడా కీలకమే. లేకపోతే రీ సౌండ్ రావొచ్చు. యంత్రంతో చెవి మార్గం నిరంతరం మూసుకుపోతే దురద, అసౌకర్యం తలెత్తొచ్చు. అలాంటి పరిస్థితుల్లో డాక్టర్‌ను సంప్రదించి చెవులను శుభ్రం చేసుకోవాలి. వినికిడి లోపంతో బాధపడే కన్నా పరికరం వాడుకోవటమే మేలు. పుట్టుకతో పూర్తి వినికిడి లోపం ఉన్న 5 ఏళ్ల లోపు పిల్లలకు కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేస్తారు.

నేడు ప్రపంచ వినికిడి దినోత్సవం

వయసుతో పాటు వచ్చేది కాదు

వినికిడిలోపాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. వయసుతోపాటు వస్తుందిలే అనే భావన విడనాడాలి. వినికిడి సమస్య మతిమరుపు, కుంగుబాటు, కిందపడిపోవటం వంటి సమస్యలకు కూడా దారితీస్తుంది. గుండెజబ్బు ముప్పు పెరగటానికి కారణమవుతోంది. చెవిలో ఉండే కర్ణభేరికి ఏదైనా విఘాతం (డ్యామేజ్) అయినప్పుడు వినికిడి సమస్య వస్తుంది. సాధారణంగా కర్ణభేరికి ఏమైనా చిల్లులు పడితే వాటంతటవే నయం అవుతాయి. కర్ణభేరి మధ్య, లోపలి చెవికి ఎలాంటి నష్టం జరగకుండా చూస్తుంది. చెవిలోకి నీరు చేరకుండా ఒక అడ్డులాగా ఉంటుంది. లోపల బ్యాక్టీరియా పేరుకుపోయినా, నీరు చేరినా వినికిడి కోల్పోయే అవకాశం ఉంటుంది. సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే వినికిడి లోపంతోపాటు చెవిలో చీమి కారడం, తీవ్రమైన చెవినొప్పికి సైతం దారితీయొచ్చు. కర్ణభేరి చిల్లులు కొలెస్టీటోమా అనే చర్మ తిత్తికి కూడా దారితీయొచ్చు. ఆలస్యం చేస్తే మధ్య చెవి ఎముకలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. చెవిపోటు సమస్యలను సైతం దారితీస్తుంది.

గుర్తించటం ఇలా ...


ఓటోస్కోప్‌తో చెవిలో సమస్యలను గుర్తించొచ్చు. ఇందులో ఉండే మాగ్నిఫైయర్ కాంతితో చెవిలోపల ఏమైనా చిల్లులు పడ్డాయా? లోపల ఇంకేమైనా సమస్యలున్నాయా? అనేది సులభంగా తెలుసుకోవచ్చు.

ఆడిటరీ టెస్ట్ (వినికిడి పరీక్ష) : చెవిలో వివిధ శబ్దాలను ఉపయోగించి పరీక్షిస్తారు. వివిధ వాల్యూమ్, ఫ్రీక్వెన్సీ శబ్దాలను ప్రయోగిస్తారు.

వినికిడి సమస్యకు కారణాలు

- చెవిలో గులిమి ప్రభావం
- చెవి లేదా తలకు గాయం
- పెద్దశబ్దం లేదా శబ్దాలకు గురికావటం
- ఒటోటాక్సిక్ మందులు
- పని- సంబంధిత ఓటోటాక్సిక్ రసాయనాలు
- వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇతర చెవి పరిస్థితులు ఆలస్యం





సిటిస్కాన్ (కంప్యూటెడ్ టోమోగ్రఫీ) : చెవులు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏమైనా వ్యాధి కారకాలు ఉన్నాయా? వంటివి తెలుసుకోవటానికి వాటి చిత్రాలను కంప్యూటర్ సహాయంతో ఇవి రూపొందిస్తాయి.

ఎంఆర్ఐ : అయస్కాంత తరంగాలను ఉపయోగించి స్కానర్ ద్వారా చెవిలోపల ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో చిత్రాలను చూడొచ్చు.

అధునాతన చికిత్సలు

ఇప్పుడు అధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. చెవిలోకి రోబోటిక్ సర్జరీలను అతి సులభంగా చేసే టెక్నాలజీ నేడు అందుబాటులో ఉంది.


టిమ్పానోప్లాస్టీ : చిల్లులు బడిన కర్ణభేరికి చికిత్స చేయటానికి ఇది అత్యంత సాధారణ చికిత్సా విధానం. చిల్లులు మూసి వేయటం, పగిలిన డ్రమ్‌కు సొంత కణజాలంతోనే మూసివేస్తారు.

వినికిడి యంత్రాలు : ప్రస్తుతం వినికిడి యంత్రాలు మార్కెట్లో అధునాతమైనవి అందుబాటులోకి వచ్చాయి. గతంలో బోన్ యాంకర్, ఇంద ఇయర్ కెనాల్‌వి ఉండేవి. ప్రస్తుతం కంప్లీట్ ఇన్ ది కెనాల్, ఇంద కెనాల్, బిహైండ్ ది ఇయర్, ఓపెన్ పిట్ టైప్ వంటి హియర్ ఎయిడ్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి బిగ్గరగా, లోపలి చెవి ప్రాసెస్ చేయటానికి దోహదపడతాయి. వినికిడి సహాయాలు, ఎముక–యాంకర్డ్ ఇంప్లాంట్లు, కాంక్లియర్ ఇంప్లాంట్లతో నేరుగా శ్రవణ నాడిని ప్రేరేపించి ధ్వని అవగాహన వస్తుంది.



– డాక్టర్ రెడ్డి పవన్‌కుమార్
ఎంబిబిఎస్, డిఎల్ఒ, ఇఎన్‌టి సర్జన్
ఆంధ్రా ఆసుపత్రి, విజయవాడ.

వేసవి వినోదం సిద్ధం





వేసవి ఎండలతో పాటు ఈ మార్చి నెలలో సినిమా విడుదలలు కూడా భారీగానే ఉన్నాయి. అగ్ర హీరోల సినిమాలతో పాటు.. చిన్న బడ్జెట్ చిత్రాలు, అనేక అనువాద చిత్రాలు వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో ఈ నెలలో విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

హిందీలో విజయవంతమైన 'ఛావా' సినిమా తెలుగులోకి అనువాదమవుతోంది. నిర్మాత అల్లు అరవింద్ ఈ సినిమా హక్కులను తీసుకున్నారు. శంభాజీ మహారాజ్ వీరగాథగా తెరకెక్కిన ఈ చిత్రంలో విక్కీ కౌశల్, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం మార్చి 7న విడుదల కానుంది. మహిళల సాధికారతకు అద్దం పట్టే 'నారి' సినిమా కూడా మార్చి 7న విడుదల కానుంది. ఆమని, వికాస్ వశిష్ఠ, ప్రగతి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని సూర్య వంటిపల్లి తెరకెక్కించారు. 'జిగేల్' అనే సినిమా కూడా అదే రోజు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా నటించిన ఈ చిత్రానికి మల్లి దర్శకుడు.



పోక్సో చట్టంపై అవగాహన కల్పించే కథాంశంతో తెరకెక్కిన 'కోర్ట్' సినిమా మార్చి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని రామ్ జగదీశ్ తెరకెక్కించగా.. ప్రియదర్శి, హర్ష రోషన్ కీలక పాత్రలు పోషించారు. కిరణ్ అబ్బవరం తాజా చిత్రం 'దిల్ రూబా' కూడా మార్చి 14న థియేటర్లలో సందడి చేయనుంది. రుక్సర్ ధిల్లాన్ కథానాయికగా నటించిన ఈ సినిమాకు విశ్వ కరుణ్ దర్శకుడు.

మార్చి 28న పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' పార్ట్ 1 విడుదల కావాల్సి ఉంది. అయితే, విడుదల తేదీ ఇంకా ఖరారు కాలేదన్న చర్చ సినీ వర్గాల్లో వినిపిస్తోంది. నితిన్ 'రాబిన్ హుడ్' మూవీతో ఆ రోజే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.





సంగీత్ శోభన్, నార్నె నితిన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'మ్యాడ్ స్క్వేర్' సినిమా మార్చి 29న విడుదల కానుంది. వీటితోపాటు అనువాద సినిమాలలో 'కింగ్‌స్టన్', 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ' మార్చి 7న విడుదల అవుతుండగా విక్రమ్ నటించిన 'వీర ధీర శూరన్ 2', మోహన్‌లాల్ 'ఎల్2 : ఎంపురాన్' మార్చి 27న రానున్నాయి.

రీ రిలీజ్‌లు : రీరిలీజ్‌లు కూడా ఈ మార్చిలో చాలానే ఉన్నాయి. వెంకటేష్, మహేష్‌బాబు నటించిన 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లెపువ్వు' సినిమా మార్చి 7న రీరిలీజ్ చేస్తున్నారు. కార్తీ నటించిన 'యుగానికి ఒక్కడు' చిత్రం మార్చి14న విడుదలకు సిద్ధంగా ఉంది. మార్చి 21న ప్రభాస్ నటించిన 'సలార్' రీరిలీజ్ అవుతోంది. అదే రోజు విజయ్‌దేవరకొండ, నాని ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'ఎవడే సుబ్రమణ్యం' చిత్రం విడుదలవుతోంది.





ఓటీటీ విడుదలలు :

ఓటీటీ రిలీజులు కూడా ఈ నెలలో బాగానే ఉన్నాయి. మొన్న సంక్రాంతికి వచ్చిన చిత్రాలు వరుసగా ప్రముఖ ఓటీటీల్లో విడుదలవుతున్నాయి. 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం మార్చి 1న, జీ5లో రాబోతోంది. విశ్వక్ సేన్ నటించిన 'లైలా' అమెజాన్‌లో స్ట్రీమింగ్‌కి సిద్ధంగా ఉంది. నాగచైతన్య, సాయిపల్లవి నటించిన 'తండేల్' కూడా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కి సిద్ధమైంది. అలాగే అనువాద చిత్రాలుగా మలయాళం సినిమాలు కూడా ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు సిద్ధం చేసుకున్నాయి. అనస్వారా రాజన్, మనోజ్ కె, సిద్ధిఖీ తదితరులు నటించిన 'రేఖాచిత్రమ్' మార్చి 7న సోనీలైవ్‌లో టెలికాస్ట్ అవుతోంది. మార్చి 20న కుంచకో బాబన్ నటించిన 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ' చిత్రం తమిళ్, తెలుగులో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. అజిత్, ప్రియమణి నటించిన 'విడాముర్చి' నెట్‌ఫ్లిక్స్‌లో మార్చి 3 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.

టీమిండియా హ్యాట్రిక్

న్యూజిలాండ్‌పై సూపర్ విక్టరీ
భారత్ సెమీఫైనల్ ప్రత్యర్థి ఆస్ట్రేలియా
వరుణ్ చక్రవర్తికి ఐదు వికెట్లు
ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025

దుబాయ్ :

టీమిండియా హ్యాట్రిక్ విజయం. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశలో వరుసగా మూడో విజయం సాధించిన భారత్ అజేయ రికార్డుతో సెమీఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం జరిగే సెమీస్‌లో అగ్రజట్టు ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత భారత్, ఆసీస్ తలపడనున్న మెగా మ్యాచ్ ఇదే.

మన మాయగాడు వరుణ్ చక్రవర్తి (5/42) ఐదు వికెట్ల ప్రదర్శనతో మ్యాచ్‌ను తిప్పేశాడు. వరుణ్ చక్రవర్తి దెబ్బకు 250 పరుగుల ఛేదనలో న్యూజిలాండ్ 205 పరుగులకే కుప్పకూలింది. 44 పరుగులతో భారత్ ఘన విజయం సాధించింది. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశ ఆఖరు మ్యాచ్‌లో గెలుపొందిన టీమిండియా.. గ్రూప్–ఎలో అగ్రస్థానం దక్కించుకుంది. దీంతో సెమీఫైనల్లో గ్రూప్–ఎలో రెండో స్థానంలో నిలిచిన ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. గ్రూప్–బి టాపర్ దక్షిణాఫ్రికాతో న్యూజిలాండ్ మరో సెమీఫైనల్లో ఢీకొట్టనుంది. ఛేదనలో కేన్ విలియమ్సన్ (81, 120 బంతుల్లో 7 ఫోర్లు) అర్ధ సెంచరీతో పోరాడినా.. కివీస్‌కు పరాజయం తప్పలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 249 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (79, 98 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు), హార్దిక్ పాండ్య (45, 45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు), అక్షర్ పటేల్ (42, 61 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ (5/42) సైతం ఐదు వికెట్ల ప్రదర్శన చేసినా.. వరుణ్ చక్రవర్తి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



శ్రేయస్ అయ్యర్ (79)

వరుణ్ మాయజాలం :

250 పరుగుల ఛేదనలో కేన్ విలియమ్సన్ (81) అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. ఓ వైపు భారత బౌలర్ల వరుస వికెట్లతో ఒత్తిడి పెంచినా.. కేన్ విలియమ్సన్ కివీస్‌ను రేసులోనే నిలిపాడు. యంగ్‌తో 32, మిచెల్‌తో 44, లేథమ్‌తో 40 పరుగుల భాగస్వామ్యాలు నిర్మించిన విలియమ్సన్ ఓ దశలోనూ భారత బౌలర్లను ఒత్తిడికి గురి చేశాడు. ఐదు ఫోర్లతో 77 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన విలియమ్సన్‌ను ఊరించిన అక్షర్ పటేల్.. స్టంపౌట్‌గా సాగనంపాడు. అప్పటికి కివీస్ స్కోరు 40.6 ఓవర్లలో 169 పరుగులు. విలియమ్సన్ నిష్క్రమణతో న్యూజిలాండ్ కథ ముగిసింది. ఆ తర్వాత మూడు వికెట్లను భారత్ అలవోకగా పడగొట్టింది. పవర్‌ప్లే తర్వాత మాయ మొదలెట్టిన వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లతో అదరగొట్టాడు. కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ సైతం మెప్పించారు. 45.3 ఓవర్లలో కివీస్ 205 పరుగులకు ఆలౌటైంది.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) యంగ్ (బి) జెమీసన్ 15, శుభ్‌మన్ గిల్ (ఎల్బీ) హెన్రీ 2, విరాట్ కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11, శ్రేయస్ అయ్యర్ (సి) యంగ్ (బి) ఓరౌర్క్ 79, అక్షర్ పటేల్ (సి) విలియమ్సన్ (బి) రచిన్ 42, కెఎల్ రాహుల్ (సి) లేథమ్ (బి) శాంట్నర్ 23, హార్దిక్ పాండ్య (సి) రచిన్ (బి) హెన్రీ 45, రవీంద్ర జడేజా (సి) విలియమ్సన్ (బి) హెన్రీ 16, మహ్మద్ షమి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 5, కుల్దీప్ యాదవ్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 10,

మొత్తం : (50 ఓవర్లలో 9 వికెట్లకు) 249.

వికెట్ల పతనం : 1–15, 2–22, 3–30, 4–128, 5–172, 6–182, 7–223, 8–246, 9–249.

బౌలింగ్ : మాట్ హెన్రీ 8–0–42–5, కైల్ జెమీసన్ 8–0–31–1, విల్ ఓరౌర్క్ 9–0–47–1, మిచెల్ శాంట్నర్ 0–1–41–1, మైకల్ బ్రాస్‌వెల్ 9–0–56–0, రచిన్ రవీంద్ర 6–0–31–1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : విల్ యంగ్ (బి) వరుణ్ 22, రచిన్ రవీంద్ర (సి) అక్షర్ (బి) హార్దిక్ 6, కేన్ విలియమ్సన్ (స్టంప్డ్) రాహుల్ (బి) అక్షర్ 81, డార్లీ మిచెల్ (ఎల్బీ) కుల్దీప్ యాదవ్ 17, టామ్ లేథమ్ (ఎల్బీ) జడేజా 14, గ్లెన్ ఫిలిప్స్ (ఎల్బీ) వరుణ్ 12, మైకల్ బ్రాస్‌వెల్ (ఎల్బీ) వరుణ్ 2, మిచెల్ శాంట్నర్ (బి) వరుణ్ 28, మాట్ హెన్రీ (సి) కోహ్లి (బి) వరుణ్ 2, కైల్ జెమీసన్ నాటౌట్ 9, విల్ ఓరౌర్క్ (బి) కుల్దీప్ యాదవ్ 1, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (45.3 ఓవర్లలో ఆలౌట్) 205.**

వికెట్ల పతనం : 1–17, 2–49, 3–93, 4–133, 5–151, 6–159, 7–169, 8–195, 9–196, 10–205.

బౌలింగ్ : మహ్మద్ షమి 4–0–15–0, హార్దిక్ పాండ్య 4–0–22–1, అక్షర్ పటేల్ 10–0–32–1, వరుణ్ చక్రవర్తి 10–0–42–5, కుల్దీప్ యాదవ్ 9.3–0–56–2, రవీంద్ర జడేజా 8–0–36–1.

రంజీ ఛాంప్ విదర్భ

ఫైనల్లో కేరళకు తప్పని నిరాశ

నాగ్‌పూర్ (మహారాష్ట్ర) : రంజీ ట్రోఫీ విదర్భ సొంతమైంది. ఐదురోజుల పాటు ఉత్కంఠగా సాగిన టైటిల్ పోరులో తొలిసారి ఫైనలిస్ట్ కేరళపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం (37 పరుగులు) సాధించిన విదర్భ ఛాంపియన్‌గా అవతరించింది. గతంలో వరుసగా రెండు సీజన్లలో విజేతగా నిలిచిన విదర్భకు ఇది ఓవరాల్‌గా మూడో రంజీ ట్రోఫీ టైటిల్. విదర్భ బ్యాటర్ డానిశ్ మలేవార్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా, విదర్భ పేసర్ హర్ష్ దూబె 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.



ఇదిలా ఉండగా రంజీ ట్రోఫీ ఫైనల్ డ్రాగా ముగిసింది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 379 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 375/9 పరుగులు చేసింది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులే చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్ విదర్భను వరించింది. రంజీ ఛాంపియన్ విదర్భ రూ.5 కోట్లు, రన్నరప్ కేరళ రూ.3 కోట్ల నగదు బహుమతి దక్కించుకున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68